RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 289 మేడ్చల్ మల్కాజ్‌గిరి 10 నవంబర్ 2024 ఆదివారం పేజీలు : 4

## ప్రపంచంలో ఉత్తమ దేశం స్విట్జర్లాండ్

న్యూఢిల్లీ : ప్రపంచంలో ఉత్తమ దేశంగా స్విట్జర్లాండ్ ఎంపికయింది. యూఎస్ న్యూస్ అండ్ వరల్డ్ రిపోర్ట్ సంస్థ 2024 సంవత్సరానికి నిర్వహించిన ఉత్తమ దేశాల ర్యాంకింగ్‌ల్లో ఈ స్థానం లభించింది. ఉత్తమ దేశంగా స్విట్జర్లాండ్ ఎంపిక కావడం వరుసగా ఇది మూడోసారి కావడం విశేషం. ఆ తరువాతి స్థానాల్లో జపాన్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాలు ఉన్నాయి. భారత్‌కు 33వ స్థానం దక్కింది. గత ఏడాదితో పోల్చితే మూడు ర్యాంకులు తగ్గాయి. మొత్తం 89 దేశాల్లో సర్వే జరిపి ర్యాంకులు ఇచ్చారు. జీవన ప్రమాణాలు, సాహసాలు, వారసత్వం, వ్యాపార దక్షత, సాంస్కృతిక ప్రయోజనం తదితర పది అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రజాభిప్రాయం సేకరించారు. స్విట్జర్లాండ్‌లో జీవన నాణ్యత, వాణిజ్యంలో పారదర్శకత బాగున్నట్టు తేలింది. భారత్ విషయానికి వస్తే 'మూవర్స్', 'వారసత్వం' అంశాల్లో మార్కులు వచ్చాయి. ఇతర ప్రాంతాలకు వెళ్లి అక్కడి పరిస్థితులకు త్వరగా అలవాటు పడేవారిని 'మూవర్స్'గా నిర్వచించారు.

# మరో హామీ అమలు దిశగా...!

## జనవరి నుండి తెల్ల రేషన్ కార్డుదారులకు

# సన్నబియ్యం




హైదరాబాద్ : తెల్ల రేషన్ కార్డుదారులకు జనవరి నుండి సన్నబియ్యం పంపిణీపై తెలంగాణ సర్కార్ గతంలో హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం ఇప్పటికే హాస్టళ్లు, స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు సన్న బియ్యం పంపిణీ చేస్తోంది. తెల్ల రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ కోసం రాష్ట్రంలో 25 లక్షల టన్నుల మేర సన్న బియ్యం డిమాండ్ ఏర్పడింది. ఇప్పుడు సన్నాల సాగు పెరగడంతో డిమాండ్ కు సరిపడా సరఫరా మన రాష్ట్రంలోనే ఉండనుంది. గతంలో డిమాండ్ కు తగ్గట్టు సన్న బియ్యం అందుబాటులో లేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉండేది. ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించి సన్నాల సాగును ప్రోత్సహించడంతో ఈసారి 36.80 లక్షల ఎకరాల్లో సన్నాలు సాగయ్యాయి. తద్వారా 88 లక్షల టన్నుల పంట దిగుబడి వస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తున్నది. ఈ వడ్లను కొనుగోలు చేసి బియ్యంగా మార్చి రేషన్‌లో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నది.

**సన్నాల సాగును ప్రోత్సహించని గత ప్రభుత్వం :** రాష్ట్రంలో 80 శాతానికి పైగా కుటుంబాలు సన్న బియ్యమే తింటున్నాయి. సన్న వడ్లకు అధిక డిమాండ్ ఉన్నప్పటికీ, గత ప్రభుత్వం సన్నాల సాగును ప్రోత్సహించలేదు. గతంలో 25 నుంచి 30 శాతానికి మించి సన్న వడ్ల సాగు జరగలేదు. రైతులు కొన్నేండ్లుగా 20 లక్షల ఎకరాలకు మించి సన్నాలు సాగు చేయలేదు. మూడేండ్ల కింద అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సన్న వడ్లు వేయాలని, బోనస్ ఇస్తామని ప్రకటించింది. కానీ ఆ తర్వాత అమలు చేయలేదు. దీంతో రైతులు సన్న వడ్లను మద్దతు ధర కంటే తక్కువ ధరకే వ్యాపారులకు అమ్ముకోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో రైతులు సన్నాల సాగును చాలా వరకు తగ్గించి దొడ్డు రకాలనే సాగు చేస్తూ వస్తున్నారు. ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ బోనస్ ప్రకటించడంతో సన్నాల వైపు మొగ్గు చూపారు.




ఇప్పటికే సంస్థాగత ఎన్నికల నిర్వహణకు పార్టీ ఎంపీ కె.లక్ష్మణ్ నేతృత్వంలో ఎన్నికల కమిటీని నియమించారు. గత ఎన్నికల్లో అబ్ కీ బార్ చార్ సౌ పార్ అన్న బీజేపీ నినాదం పెద్దగా వర్కౌట్ కాలేదు. మొత్తంగా బీజేపీ 240 సీట్లకు.. ఎన్డీయే 293 సీట్లకే పరిమితం అయింది.

ఈ సందర్భంగా కమిటీ రెండ్రోజుల కిందటే పార్టీ కీలక నేతలతో వర్క్‌షాప్ నిర్వహించి సంస్థాగత ఎన్ని కల ప్రక్రియపై మార్గదర్శనం చేసింది. బీజేపీలో మొదట బూత్, ఆ తర్వాత మండల, ఆ తర్వాత జిల్లా స్థాయిలో ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తారు. ఎన్నికల అధికారులు ప్రకటించే తేదీల్లో బూత్, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయిలో అధ్యక్ష ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడి ఎన్నికతోపాటు రాష్ట్ర కౌన్సిల్

## తెలంగాణకు అంత ప్రాధాన్యమిస్తారా...!?

సభ్యుడి ఎన్నిక కూడా నిర్వహిస్తారు.

రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల తర్వాత రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ కౌన్సిల్ సభ్యులను ఎన్నుకోవాలి. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాష్ట్రాల అధ్యక్షుడిని ఎన్నుకోనుండగా, జాతీయ కౌన్సిల్ సభ్యులు జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. ఈ మొత్తం ప్రక్రియ పూర్తి కావడానికి దాదాపు 2 నెలల సమయం.. అంటే డిసెంబర్ రెండో వారానికి పూర్తవుతుంది, ఆ తర్వాత జాతీయ అధ్యక్షుడి పేరును ప్రకటిస్తారు. ప్రస్తుత అధ్యక్షుడిగా ఉన్న జేపీ నడ్డా పదవీకాలం గత ఏడాది డిసెంబర్‌తో ముగిసింది. కానీ సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఆయన పదవీకాలాన్ని జూన్ 30 వరకు పొడిగించారు. ఆ తర్వాతా ఆయన్నే కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఆయన కేంద్ర ఆరోగ్య మంత్రిగా .. రాజ్యసభ అధినేతగా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో ఆరు నెలల నుంచి వివిధ పేర్లపై బీజేపీ కసరత్తు చేస్తోంది. ఇందులో తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డితోపాటు సీనియర్ నేతలు శివరాజ్‌సింగ్ చౌహాన్ , సునీల్ భూపేంద్ర యాదవ్ , దేవేంద్ర ఫడ్నవీస్ , ధర్మేంద్ర ప్రధాన్ ల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. కర్ణాటకలో తిరిగి అధికారం చేజిక్కించుకోవడం సహా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళలో పార్టీని మరింత విస్తరించాలని భావిస్తున్న బీజేపీ.. దక్షిణాది రాష్ట్రాల నుంచే అధ్యక్షుడిని ఎంపిక చేస్తుందని బలమైన ప్రచారం జరుగుతోంది. జనవరిలో ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరిగే అవకాశమున్న దృష్ట్యా, డిసెంబర్ రెండు లేదా మూడో వారానికి కొత్త అధ్యక్షుడి నియామక ప్రక్రియ పూర్తి చేయాలనే టార్గెట్ తో బీజేపీ అధినాయకత్వం ఉంది.



## మిత్తీతో సహా చెల్లిస్తాం.. కేటీఆర్ వార్నింగ్

హైదరాబాద్, నవంబర్ 9: హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై పోలీసులు అమానుషంగా దాడి చేయటంపై మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌశిక్ రెడ్డి విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండించారు. దళితబంధు లబ్ధిదారులకు రెండో విడత ఆర్థిక సాయం చేయాలని అడిగితే ఎమ్మెల్యే అని కూడా చూడకుండా పోలీసులు విచక్షణరహితంగా దాడి చేస్తారా అంటూ మండిపడ్డారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ప్రజా ప్రతినిధులపై కూడా దాడికి తెగబడటమేనా ఇందిరమ్మ రాజ్యమంటే అని నిలదీశారు. ఇచ్చిన హామీలు అమలు చేయటం చేతగాని దద్దమ్మ రేవంత్ సర్కార్ అని... అడిగిన వారిపై దాడులు చేసే సంస్కృతికి తెరలేపిందని విమర్శించారు. ప్రభుత్వ పెద్దల మెప్పు పొందేందుకు పోలీసులు ఓవరాక్షన్ చేస్తే... తాము వచ్చాక తప్పకుండా మిత్తితో చెల్లిస్తామంటూ హెచ్చరించారు. కౌశిక్ రెడ్డి అంటే సీఎం రేవంత్ రెడ్డికి భయం పట్టుకుందన్నారు. ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడు నిలదీస్తున్న కౌశిక్ రెడ్డిపై రేవంత్ రెడ్డి కక్ష పెంచుకున్నారని విమర్శించారు. మొన్న ఈ మధ్యనే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే గాంధీతో గుండాగిరి చేయించి కౌశిక్ రెడ్డిపై దాడి చేసే ప్రయత్నం చేశారని ఆరోపించారు. అయినా వెనక్కి తగ్గకుండా ప్రజల కోసం పోరాటం చేస్తున్న కౌశిక్ రెడ్డిపై ఈసారి పోలీసుల ద్వారానే రేవంత్ రెడ్డి దాడి చేయించారన్నారు. ప్రశ్నిస్తే భయపడి దాడులకు పాల్పడే ఇంత పిరికి ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదన్నారు. కౌశిక్ రెడ్డిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని.. ఇలాంటి తాటాకు చప్పుళ్లకు బీఆర్ఎస్ సైనికులెవరు భయపడని స్పష్టం చేశారు. కౌశిక్ రెడ్డిపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా పోలీసులు అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ కార్యకర్తలందరినీ వెంటనే విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.




హైదరాబాద్ : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిస్థానిక సంస్థలకు రెఢీ అవుతున్నారు. నేతలను అందుకు అనుగుణంగా సిద్ధం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలను దెబ్బతీసేలా కసరత్తులు చేస్తున్నారు. అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే కాకుండా ప్రతిపక్షాలను నిర్వీర్యం చేయాలనే ఆలోచనతో రేవంత్ రెడ్డి ఉన్నారు.

అందుకోసం అస్త్రశస్త్రాలను సిద్ధం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందే ప్రభుత్వం నుంచి అన్ని రకాలుగా పథకాలను అందించి ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్లే ప్రయత్నాలు ప్రారంభించారు. అందుకోసం రేవంత్ రెడ్డికాంగ్రెస్ శాసన సభ పక్ష సమావేశం కూడా నిర్వహించారు. సమావేశం మొత్తం స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుకు సాగడంపైనే సాగింది. తెలంగాణకు కొత్త పీసీసీ అధ్యక్షుడు రావడంతో అన్ని రకాలుగా ముందుకు వెళ్లి పార్టీని బలోపేతం చేయాల్సిన అంశాలపై చర్చించారు. అందుకోసమే ప్రత్యేకంగా సీఎల్పీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నేతలకు నియోజకవర్గాలుగా బాధ్యతలను అప్పగించి.. అక్కడి ప్రధాన సమస్యలపై రానున్న కాలంలో దృష్టి పెట్టి నోటిఫికేషన్ కు ముందే ప్రజల మనసులను గెలిచే ప్రయత్నంలో రేవంత్ రెడ్డి ఉన్నారు. 100 శాతం స్రైయిక్ రేట్ తో విజయం సాధించాలనే లక్ష్యాన్ని నేతలకు విధించినట్లు తెలిసింది. దీంతో పాటు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్

# 'స్థానికం'పై గురిపెట్టి...!

## మరో రోడ్డు మ్యాప్ సిద్ధం చేస్తున్న రేవంత్..!

# స్కెచ్ మామూలుగా లేదుగా?

ను కూడా బలహీన పరిచేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. మరిన్ని పథకాలను వీలైనంత త్వరగా అమలు చేయాలనే నిర్ణయానికి సీఎం రేవంత్ వచ్చారు. దీనికోసం రోడ్ మ్యాప్ ను రెడీ చేస్తున్నారు. అమలు చేసిన హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు మిగిలిపోయిన రైతు భరోసా, మహా లక్ష్మి పథకంలో కొన్నింటిని అమలు చేయడంపై కసరత్తులు చేస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఒకే మాట మీద ఉండాలని.. సమన్వయం లేకుండా ప్రకటనలు చేస్తే ప్రతిపక్ష పార్టీలకు ఊతమిచ్చినట్లు అవుతుందనే అభిప్రాయంతో రేవంత్ ఉన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా రైతు రుణమాఫీ అంశాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం రేవంత్ దిశా నిర్దేశం చేశారు.

# సంపాదకీయం

## ఉక్రెయిన్-రష్యా మధ్యలో చమురు దీపం
## మోదీ వెళ్లింది ఇందుకే!

ఉక్రెయిన్-రష్యా యుద్ధం మొదలై రెండున్నరేళ్లు.. అమెరికా సహా పశ్చిమ దేశాలన్నీ మొదటినుంచి ఉక్రెయిన్ వైపు నిలిచాయి. రష్యా పక్షాన చైనా, ఉత్తర కొరియా, ఇరాన్ మాత్రమే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ ఎటువైపు? దీనిపై తీవ్ర ఒత్తిడి వచ్చింది. అయితే, దశాబ్దాలుగా మనకు రష్యా మిత్ర దేశం. అమెరికా మనల్ని శత్రువుగా చూసిన రోజుల్లోనే రష్యా సాయం చేసింది. ఇంకోవైపు ఉక్రెయిన్ అటు మిత్ర దేశం కాదు. అలాగని విభేదాలూ లేవు. మన విద్యార్థులు వేల సంఖ్యలో ఆ దేశంలో చదువుతున్నారు. నూనెలు సహా ఇతర దిగుమతులు ఆ దేశం నుంచే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్‌కు వ్యతిరేకంగా మాట్లాడలేని పరిస్థితి.

**మధ్యవర్తిత్వం ఎందుకో?...** ఉక్రెయిన్-రష్యా యుద్ధం మొదలైన తొలి రోజుల్లోనే మోదీ తాను మధ్యవర్తిత్వానికి సిద్ధం అని ప్రకటించారు. కాకపోతే ఆ వేడిలో ఎవరూ పట్టించుకోలేదు. తాజాగా రష్యా-ఉక్రెయిన్ లలో పర్యటించి శాంతి సందేశం ఇచ్చారు. పైకి మోదీ శాంతి ప్రయత్నాలే కనిపిస్తున్నా.. వెనుక చాలా వ్యూహమే ఉంది. కాగా, రష్యా నుంచి యూరప్ దేశాలు చాలావాటికి ఇంధనం సరఫరా అవుతుంటుంది. ఆ దేశం ఉక్రెయిన్ పై యుద్ధానికి దిగిన తొలి రోజుల్లో యూరప్ దేశాలు తీవ్ర ఆందోళనకు గురయ్యాయి. ఇప్పుడు భారత్ కూడా అదే పరిస్థితుల్లో ఉంది. భారత ఆర్థిక వ్యవస్థకు కీలకమైన చమురు దిగుమతులకు ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి ముగింపు అత్యవసరం. అందుకే మోదీ చొరవచూపారని సమాచారం. ఓవైపు మోదీ వచ్చాక భారత్ లో చమురు ధరలు రెట్టింపు అయిన వైనాన్ని ప్రతిపక్షాలు దెప్పిపొడుస్తున్నాయి. ఇలాంటి సమయంలో ఇంకా ధరలు పెరిగితే అది ఇబ్బందికర పరిస్థితికి దారితీస్తుంది. అందుకే ధరలను స్థిరంగా ఉంచేందుకు ఉక్రెయిన్-రష్యాలకు సమ దూరం పాటించారు మోదీ. తద్వారా చమురు రవాణా చైన్ దెబ్బతినకుండా చూశారు.

**రష్యాతో పెట్టుకుంటే చమురు వదులుద్ది...** ఉక్రెయిన్ పై రష్యా దండయాత్రతో ఆఫ్రికా దేశాలకు అత్యంత ముఖ్యమైన గోధుమల సరఫరా నిలిచిపోయింది. దీంతో మానవతా కోణంలో వాటిని ఎగుమతి చేసేందుకు రష్యా అంగీకరించింది. ప్రపంచ వాణిజ్యంపై, ముఖ్యంగా చమురు, గ్యాస్, గోధుమలు, ఎరువుల సరఫరాపై కూడా ప్రతికూల ప్రభావం పడింది. ఎందుకంటే ప్రపంచంలో అతిపెద్ద చమురు ఉత్పత్తిదారుల్లో రష్యా ఒకటి. కానీ, పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధించడంతో, ప్రపంచ చమురు సరఫరా దుర్లభమైంది. రష్యా చమురు లేకుంటే దీపం వెలగని పరిస్థితి యూరప్ దేశాలది. దీంతో అవి ప్రత్యామ్నాయాల కోసం ప్రయత్నాలు మొదలుపెట్టాయి. మరి భారత్ ముడి చమురులో దాదాపు 80 శాతం దిగుమతి చేసుకునే దేశం. ఇలాంటి పరిస్థితుల్లో ఉక్రెయిన్-రష్యా యుద్ధం మనకు మరింత ఇబ్బందికరం అయ్యేది. కానీ, మోదీ విధానంతో నేర్పుగా ఎదుర్కొంటోంది. ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు పెరిగినప్పుడు ఆ ప్రభావాన్ని తగ్గించేందుకు రాయితీతో రష్యా చమురు పొందింది భారత్. దౌత్య మార్గాలతో పశ్చిమ దేశాలతో సంబంధాలు చెడకుండా చూసుకుంది.

## సమగ్ర కుటుంబ సర్వేలో లోటుపాట్లకు తావివ్వకుండా సమగ్రంగా సర్వే నిర్వహించాలి... మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం



జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎన్యుమరేటర్లు నిర్దేశిత ప్రొఫార్మాల నమోదులో కోడింగ్ ను అత్యంత జాగరుకతతో నింపాలని, ఎన్యుమరేటర్లు పూరించిన ప్రొఫార్మాలలో ప్రత్యేకించి కోడింగ్ ను సూపర్ వైజర్లు క్షుణ్ణంగా పరిశీలించాలని మేడ్చెల్ మల్కాజిగిరి జల్లా కలెక్టర్ గౌతం పొట్రు అన్నారు.

శనివారం నుండి ప్రారంభమైన ఇంటింటి సమగ్ర సర్వేలో భాగంగా శామీర్ పేట్ మండలంలోని ఆలియాబాదు గ్రామంలో ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్న కుటుంబాల వివరాల సేకరణ ను కలెక్టరు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ... ఏవిధంగా ప్రొఫార్మాలను నింపుతున్నారని ఎన్యుమరేటర్లు అడిగి తెలుసుకున్నారు. ఎన్యుమరేటర్లు పూరించిన ప్రొఫార్మాలను క్షుణ్ణంగా పరిశీలించి ప్రొఫార్మాలలో నిర్దేశించిన చోట పుస్తకంలో ఇచ్చిన విధంగా కోడింగ్ లను నింపాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. మొదటిరోజు కాబట్టి కొంత నిదానంగా తప్పులు జరుగకుండా జాగ్రత్తగా ప్రొఫార్మాలను పూరించేలా ఎన్యుమరేటర్లకు సూచించాలని ఎంపిడిఓను ఆదేశించారు. జిల్లాలోని ఇతర మండల గ్రామాల్లో సైతం కలెక్టర్ సంబంధిత అధికారుల కుటుంబ సర్వే పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ మమతాబాయి, సూపర్ వైజర్లు, ఎన్యుమరేటర్లు, అలియాబాద్ గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించగలిగితే మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించగలరు : డీఈవో విజయ కుమారి

### రాష్ట్రస్థాయి చెస్ పోటీలను ప్రారంభించిన డీఈవో






శామీర్ పేట, (గరుడ వార్త) : విద్యార్థులు విద్యతోపాటు వారికి ఆసక్తి ఉన్న క్రీడల్లో ప్రతిభ కనబరచగలిగితే మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని జిల్లా విద్యాధికారి విజయ కుమారి అన్నారు. శనివారం శామీర్ పేట మండలం తూముకుంట లోని శ్రీ విజ్ఞాన భారతి హై స్కూల్లో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలను ట్రస్మా జిల్లా ఉపాధ్యక్షుడు, పాఠశాల కరస్పాండెంట్ గోనె హనుమంత్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని చెప్పారు. విద్యతో పాటు క్రీడల్లో పాల్గొంటూ అత్యుత్తమ ప్రతిభ కనపర్చాలని సూచించారు. ఈ చెస్ పోటీలతో విద్యార్థులకు మేధాశక్తి పెరుగుతుందని తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసి జాతీయస్థాయి పోటీలకు పంపనున్నట్లు చెప్పారు. ఈ పోటీలలో ఉమ్మడి 10 జిల్లాల నుంచి 200 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వసంతకుమారి, ఎస్ జి ఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిష్టయ్య, ఫిజికల్ డైరెక్టర్లు సత్తిరెడ్డి, గోనె అరుణ జ్యోతి, గోనె కవిత, గోనె మదన్ మోహన్ రెడ్డి, మురళీకృష్ణ, పాఠశాల ప్రిన్సిపల్ జంగారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ వంశీ గౌడ్, ప్రధానోపాధ్యాయురాలు గోనె సంగీత, పి ఈ టి గోనె ప్రశాంత్ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి సిగలో మరో విద్యుత్తు కేంద్రం



గోదావరిఖని: మరో 800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మించాలని సింగరేణి ప్రణాళికలు రచించుకుంటుంది. ఇప్పటికే ఆ పనులు టెండర్ దశకు చేరుకున్నాయి. పదేళ్ల క్రితం మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద ఎస్టీపీపీలో మరో ప్లాంటు నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినా పురోగతి లేకుండా పోయింది. ఇటీవల దానిపై తిరిగి పనులు చేపట్టేందుకు యాజమాన్యం ప్రణాళికలు చేసింది. దానికి సంబంధించిన నివేదికలు తయారు చేసిన సింగరేణి.. త్వరలో టెండరు పిలిచేందుకు ఏర్పాట్లు చేసింది. త్వరలోనే శంకుస్థాపన చేసేందుకు కూడా ప్రజాప్రతినిధుల సమయం కోసం వేచి చూస్తుంది. ఇదివరకే జైపూర్ వద్ద 1200 మెగావాట్ల రెండు యూనిట్లను నిర్మించింది.

**రూ.10 వేల కోట్ల వ్యయంతో..**

రెండో దశలో నిర్మించే 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్ర నిర్మాణానికి సంబంధించిన అంచనాలు తయారు చేసింది. సుమారు రూ.10 వేల కోట్ల వ్యయంతో పనులు చేపట్టాలని భావిస్తుంది. అయితే పనులను ఎవరికి అప్పగించాలనే సమాలోచనలో ఉంది. మొదటి దశలో నిర్మించిన రెండు యూనిట్లకు సంబంధించిన పనులను బీహెచ్ఈఎల్‌కు అప్పగించింది. అవసరమైన బొగ్గు, నీరు అందుబాటులోనే ఉండటంతో.. పనులు పూర్తికాగానే ఉత్పత్తికి ఇబ్బంది ఉండదన్న అభిప్రాయం ఉంది. సింగరేణి గనుల నుంచి వెలికి తీసిన బొగ్గును ఈ ప్లాంటుకు వినియోగించుకునే అవకాశం ఉంది. ఇప్పటికే సింగరేణి విద్యుత్తు కేంద్రం కోసం శెట్టిపల్లి వద్ద నిర్మించిన జలాశయం నుంచి నీటిని తీసుకొనే వెసలుబాటు ఉంది.

3,500 మెగావాట్ల ఉత్పత్తిపై దృష్టిథర్మల్ విద్యుత్తు కేంద్రాలతోపాటు సోలార్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలను సింగరేణి నిర్మించింది. రెండు కేంద్రాల ద్వారా 1200 మెగావాట్లను విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్న సింగరేణి.. 278 మెగావాట్ల సోలార్ విద్యుత్తును ఉత్పత్తి చేస్తోంది. వీటికితోడు మరో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్రం నిర్మాణానికి సిద్ధమైన సింగరేణి.. మరో 500 మెగావాట్ల హైడ్రో విద్యుత్తు కేంద్రం నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. వీటితోపాటు జలాశయాలపై 500 మెగావాట్ల సోలార్ విద్యుత్తు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు. మొత్తంగా 3,500 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయనుంది. రాష్ట్ర విద్యుత్తు అవసరాలు తీర్చే దిశగా సింగరేణి ప్రణాళికలు చేసుకుంటుంది.

## బుద్ధవనంతో సాగర్ రహదారి విస్తరణ

యాచారం : నాగార్జున సాగర్‌లోని బుద్ధవనం పుణ్యమా అని హైదరాబాద్-నాగార్జున సాగర్ రహదారి విస్తరణకు మోక్షం లభించనుంది. బౌద్ధ పర్యాటక ప్రాంతాల సమగ్ర అభివృద్ధిలో భాగంగా ఈ అంతర్రాష్ట్ర ప్రధాన రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల అధికారులను ఆదేశించడం తెలిసిందే. దీంతో అధికారుల్లో కదలిక మొదల్యింది. ప్రైవేటు ఏజెన్సీ ద్వారా డీపీఆర్(సమగ్ర ప్రాజెక్టు నివేదిక) డీపీఆర్ సిద్ధంచేస్తారు. తరువాత నిధులు కేటాయించి పనులుప్రారంభిస్తారు. ఏడు మీటర్ల వెడల్పు ఉన్న రోడ్డును కృష్ణా పుష్కరాల వేళ 2016లో 10 మీటర్ల(రెండు వరుసలు) వెడల్పుగా విస్తరించారు. ఇప్పుడు నాలుగు వరుసలు(16 మీటర్లు)గా విస్తరించనున్నారు.

**అప్పట్లో రూ.300 కోట్లతో ప్రతిపాదనలు**

సాగర్ రహదారి విస్తరణపై అధికారులు రెండేళ్ల క్రితమే అంచనాలు రూపొందించారు. ఇరువైపులా ఉన్న కృష్ణా తాగునీటి పైపులైన్ల కారణంగా రోడ్డు విస్తరణ సాధ్యాసాధ్యాలపై ఆర్అండ్‌బీ, మహానగర జలమండలి అధికారులు సంయుక్త సర్వేచేశారు. యాచారం మండలం తక్కళ్లపల్లి మినహా మిగిలిన చోట్ల నాలుగు వరుసలుగా విస్తరించవచ్చని గుర్తించామని ఆ సర్వేలో పాల్గొన్న డీఈ వేణుగోపాల్‌రెడ్డి ఇటీవల చెప్పారు. ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడ, యాచారం మండలం గున్‌గల్, మంచాల మండలం ఆగాపల్లి వద్ద అండర్‌పాస్ రోడ్డు నిర్మించాలని నిర్ణయించారు. ఇబ్రహీంపట్నంవద్ద కృష్ణా పైపులైన్ ఉన్న బైపాస్‌రోడ్డు జలమండలి ఆధీనంలో ఉంది. మొత్తం రహదారి నాలుగు వరుసల అభివృద్ధికి రూ.300కోట్లు అవసరమవుతాయని ప్రాథమిక అంచనాను ప్రభుత్వానికి అందజేశారు. నిధుల కొరతతో డీపీఆర్ సిద్ధంచేయలేదు. ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది.

ప్రస్తుతం ఇదీ పరిస్థితి హైదరాబాద్‌నుంచి మాల్ వరకు 60 కి.మీ.ల సాగర్ రహదారి రంగారెడ్డి జిల్లా పరిధిలో ఉంది. మిగిలిన రహదారి నల్గొండ జిల్లాలో ఉంటుంది. నగరంలోని ఇన్నర్ రింగ్‌రోడ్డునుంచి ఓఆర్ఆర్(బొంగులూరు) వరకు 6 వరుసలుగా, అక్కడి నుంచి ఇబ్రహీంపట్నం వరకు 4 వరుసలుగా రహదారి ఉంది. ఇబ్రహీంపట్నం నుంచి సాగర్ వరకు నాలుగు వరుసలుగా విస్తరించి మధ్యలో విభాగిని ఏర్పాటుపనులు కొత్తగా చేపట్టాల్సి ఉంటుంది.

**త్వరలో డీపీఆర్ పనులు- మధుసూదన్, ఈఈ, ఆర్అండ్‌బీ**

సాగర్ రహదారి విస్తరణకు డీపీఆర్ రూపొందించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. విస్తరణ పనులు హైవేస్ అథారిటీలీ ద్వారా చేయిస్తారా లేక ఆర్అండ్‌బీ శాఖతో చేయిస్తారా అనేది స్పష్టం కావాల్సి ఉంది.

## రైతులకు ఎటువంటి ఇబ్బందులకు తావివ్వకుండా ధాన్యం కొనుగోలు చేయాలి : అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

### ఇంటింటి సర్వేను, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, నూతనంగా నిర్మిస్తున్న తాహాసిల్దార్ భవనాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్

శామీర్ పేట, (గరుడ వార్త) : రైతులకు ఎలాంటి ఇబ్బందులకు తావివ్వకుండా ధాన్యం కొనుగోలు చేయాలని అదనప కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం మూడు చింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రం, మూడు చింతలపల్లి లో నూతనంగా నిర్మిస్తున్న తహసిల్దార్ భవనాన్ని, జగన్ గుడాలో ఎన్యూమరేటర్లు





నిర్వహిస్తున్న వివరాల సేకరణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ దాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అలాగే మూడు చింతలపల్లి లో నూతనంగా నిర్మిస్తున్న తహసిల్దార్ భవనాన్ని పరిశీలించిన ఆయన తొందరగా నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జగన్ గుడాలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి సర్వేలో వివరాలను తప్పులు లేకుండా ప్రొఫార్మాలోని కోడింగ్లను నింపాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఎన్యూమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## రూ.9.90లకే జీబీ డేటా ఇస్తున్నాం!

హైదరాబాద్: 'ప్రైవేటు టెలికాం సంస్థలతో పోల్చుకుంటే బీఎస్ఎన్ఎల్ సేవలు ఎంతో చవకైనవి. రూ.9.90 పైసలకే ఒక జీబీ డేటా ఇస్తున్నాం. ఇంత తక్కువ ధరలో ఏ టెలికాం ఆపరేటర్ ఇవ్వడం లేదు. ఇంటర్నెట్ వేగాన్ని పెంచేందుకు అత్యాధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరిశోధనలు చేస్తున్నాం. వచ్చే ఆరేళ్లలో ఆరో జనరేషన్(6-జీ) సేవల్లో పది శాతం బీఎస్ఎన్ఎల్ వాటా ఉండాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకూ సమాచార నెట్‌వర్క్ లేని 26వేల గ్రామాల్లో వీలైనంత వేగంగా సెల్‌ఫోన్ టవర్లు ఏర్పాటు చేయనున్నాం. విద్యార్థులు, యువత మా నెట్‌వర్క్‌కు ఆకర్షితులయ్యేలా ప్రణాళిలు అమలు చేస్తున్నా"మని కేంద్ర టెలికాం శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్(ఐసీటీ) అతుల్ సిన్హా అన్నారు. ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లో ఓ కార్యక్రమానికి హాజరైన మాట్లాడారు. ప్రైవేటు టెలికాం ఆపరేటర్లు రీఛార్జ్ ధరలు పెంచినా.. తాము మాత్రం పెంచడం లేదని తెలిపారు.గ్రామీణ ప్రాంతాలకు ప్రాధాన్యం.. ప్రైవేటు, కార్పొరేటు, విదేశీ టెలికాం ఆపరేటర్లు పట్టణాలు.. నగరాలకే ప్రాధాన్యమిస్తుండగా.. వివిధ రాష్ట్రాల్లోని మారుమూల గ్రామీణ ప్రాంతాలకే మేం ప్రాధాన్యమిస్తున్నాం. బ్యాంకులు, ఆసుపత్రులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకురావ




డంతో ఇంటర్నెట్ కనెక్టివిటీకి ప్రాధాన్యం పెరిగింది. నగదుకు బదులుగా డిజిటల్ చెల్లింపులు పెరిగాక గ్రామాల్లో మహిళలు, పిల్లలు జీపే, ఫోన్‌పే, పేటీఎం, భీమ్‌లను ఎంచుకుంటున్నారు. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకునే 26వేల గ్రామాల్లో సెల్‌ఫోన్ టవర్లు అందుబాటులోకి తీసుకువస్తున్నాం.

**కొత్త సంవత్సరంలో 5జీ సేవలు**

ఇంటర్నెట్, మొబైల్ సేవల్లో ప్రైవేటు, సంస్థలతో పోలిస్తే.. వేగంగా ముందుకు వెళ్తున్నాం. కొత్త సంవత్సరంలో బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు 5జీ సేవలు అందించనున్నాం. 5జీ టెక్నాలజీని పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించాం. చరవాణులు, బ్రాడ్‌బాండ్ సహా ఇతర ఫ్రీక్వెన్సీలకు ఇది ఉపయోగపడనుంది. విదేశీ సంస్థలకు దీటుగా సాంకేతిక పరిజ్ఞానం ఉండడంతో మెట్రో నగరాల్లో విద్యార్థులు, యువకులు బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌ను ఇష్టపడుతున్నారు.

# అవగాహన లోపం.. ప్రమాదాలకు ఆస్కారం

చొప్పదండి: ఈ ఘటనలను చూస్తే కొంతమంది రైతులకు సరైన అవగాహన లేదని అర్థమవుతోంది. ఆరుగాలం పండించిన పంట చేతికందే సమయంలో కూలీల కొరత కారణంగా యంత్రాలపై ఆధారపడుతున్నారు. వీటితో కోతలు చేసే సమయంలో అవగాహన లేమితో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై హార్వెస్టర్‌తో కోతల సమయంలో...

1వరి కోసే సమయంలో యంత్రం పూర్తి స్థాయిలో ధాన్యం కర్రలను కోయలేకపోతుంది. కొన్ని కర్రలు మిగిలిపోతున్నాయని, వాటిని కూడా కోయాలని కొందరు రైతులు యంత్రం వెనకాలే తిరుగుతూ ఉంటారు. యంత్రం నడిపే వ్యక్తికి వెనుక వచ్చే రైతు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటు జరుగుతుంటాయి. సాధ్యమైనంత వరకు కోత పూర్తయ్యే వరకు రైతులు యంత్రం చుట్టూ తిరగకూడదు.

2పొలంలో విద్యుత్తు తీగలు ఉన్నప్పుడు యంత్రానికి సంబంధించిన వ్యక్తులు ఇద్దరి మధ్య సమన్వయ లోపంతో ఒకరు తీగలు పక్కకు జరుపుతుంటే, అది గమనించక యంత్రాన్ని ప్రారంభించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. యంత్రం నడిపే వ్యక్తుల మధ్య సమన్వయం అవసరం.

3యంత్రం నడిచే సమయంలో దాని వైబ్రేషన్‌కు బేరింగ్‌లు, నట్లు, బోల్టులు, ఇనుపచువ్వలు తరచూ ఎగిరిపడుతుంటాయి. రైతులు ఈ విషయం తెలియక యంత్రం పక్కనే తిరుగుతుంటారు. యంత్రం



నడిచే సమయంలో కనీసం 3 మీటర్ల దూరంలో ఉండాలి.

4కోసిన తర్వాత ధాన్యాన్ని ట్రాక్టర్‌లో పోసే సమయంలో.. రైతులు దానిపైకి ఎక్కి నేర్పుతూ ఉంటారు. ఈ సమయంలో డ్రైవర్లకు రైతులు కనిపించకపోవడంతో ధాన్యం పోసే పైపు తగిలి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రైతులు ట్రాక్టర్ ఎక్కకుండా ఉండాలి.

5 డ్రైవర్లు పూర్తిగా యంత్రాన్ని ఆఫ్ చేయకుండానే దిగి పనులు చేసుకుంటారు. ఇలా చేయకుండా ఉండాలి. పూర్తిగా యంత్రాన్ని నిలిపిన తర్వాతనే దిగాలి.

6 యంత్రం చాలా సమయం నడిచిన తర్వాత కూలెంట్ వాటర్ వేడెక్కి రేడియేటర్ నుంచి వేడి నీరు డ్రైవర్లపై పడే అవకాశముంది. సాధ్యమైనంత వరకు ఇంజన్ వేడెక్కినప్పుడు కొంత సమయం నడపకూడదు.

7వరి కోసే సమయంలో చీర కట్టుకున్న ఆడవారు, వదులు దుస్తులు ధరించిన వారు యంత్రం సమీపంలోకి ఎట్టి పరిస్థితిలో వెళ్లొద్దు. గాలిక వస్త్రం ఎగిరి మెషిన్‌లో పడే అవకాశముంది. వెంటనే అది లాగేసుకుంటుంది.

ఇటీవల కరీంనగర్ జిల్లాలోని శంకరపట్నం మండలంలోని చింతల పల్లిలో వరి కోసే సమయంలో యంత్రానికి సంబంధించిన కట్టర్ బార్ సరి చేస్తుండగా మరో వ్యక్తి యంత్రాన్ని స్టార్ట్ చేయడంతో కట్టర్ బార్‌లో చేయి ఇరుక్కొని తెగి పడింది.

మానకొండూర్ మండలం లక్ష్మీపూర్‌లో ఓ రైతు కోసిన వరి గడ్డిని పశుగ్రాసం కోసం బేలర్ యంత్రం సాయంతో కట్టలు కడుతుండగా దారం సరి చేసే సమయంలో చేయి యంత్రంలో ఇరుక్కోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు.

గడ్డి కట్టలు కట్టే సమయంలో....

1. బేలర్ సాయంతో గడ్డి కట్టలు కట్టే సమయంలో దారం తెగిపోతే, దానిని సరిచేసేందుకు ప్రయత్నిస్తుండటంతో చేతులు యంత్రంలో ఇరుక్కుపోతున్నాయి. యంత్రం పూర్తి స్థాయిలో ఇంజన్ ఆఫ్ చేసిన తర్వాతనే దారం సరిచేయాలి. దారం అయిపోతే కొత్తది ఏర్పాటు చేయాలి. 2. పొలంలో ఉన్న గడ్డిని యంత్రం సరిగా తీసుకోవడం లేదని.. అది నడుస్తున్నప్పుడు దానికి సంబంధించిన ఇనుప చువ్వలను సరిచేయకూడదు.

3. గడ్డి కట్టలు కట్టడం పూర్తయ్యే వరకు యంత్రం పక్కకు వెళ్లకూడదు.

# సిగ్నల్స్ వెలగడం లేదు!

కోరుట్ల: కోరుట్ల జిల్లాలోనే రెండో పెద్ద పట్టణం. సుమారు లక్ష వరకు జనాభా ఉంటుంది. పట్టణం భారీగా విస్తరిస్తుండటంతో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాల వినియోగం పెరిగింది. పెరిగిన జనాభా, వాహనాల సంఖ్యకు అనుగుణంగా రోడ్లను విస్తరించడం, అభివృద్ధి చేయడంలో పాలకులు పూర్తిగా విఫలమవుతున్నారు.

**తరచూ ప్రమాదాలు**

63వ జాతీయ రహదారి కోరుట్ల పట్టణం మీదుగా వెళ్తుంది. ఈ రహదారిపై నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సుమారు మూడేళ్ల కిందట నందిచౌక్, కల్లూర్‌రోడ్డు సర్కిల్ వద్ద సుమారు రూ.7 లక్షలు వెచ్చించి ట్రాఫిక్ సిగ్నల్స్ పరికరాలు ఏర్పాటు చేయించారు. పరికరాలకు ఏర్పాటు చేసిన సోలార్ సిస్టమ్ పనిచేయకపోవడం, విద్యుత్తు సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో ట్రాఫిక్ సిగ్నల్స్ పూర్తిస్థాయిలో పని చేసిన దాఖలాలు లేవు. ట్రాఫిక్ సిగ్నల్స్ పని చేసిన రోజులు వాహనదారులు రాకపోకలు సజావుగా సాగించేవారు. కొన్ని నెలలుగా నందిచౌక్, కల్లూర్‌రోడ్డు సర్కిల్ వద్దనున్న ట్రాఫిక్ సిగ్నల్స్ పూర్తిగా పని చేయడం లేదు. అత్యంత రద్దీ ప్రాంతమైన కల్లూర్‌రోడ్డు సర్కిల్‌లో వాహనాలు జాతీయ రహదారిపై నేరుగా వెళ్లడం, కల్లూర్‌రోడ్డు, ఇందిరారోడ్డుల వైపునకు వెళ్లడం, రోడ్డును పాదచారులు దాటడం చాలా ఇబ్బందికరంగా మారింది. రోడ్డు దాటే వాహనాలను గమనించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

**పోలీసులను నియమించాలి..**

ఉదయం, సాయంత్రం వేళలో రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో రోడ్డు దాటడం కష్టంగా మారిందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. సిగ్నల్స్ పనిచేయనందున రద్దీ ప్రాంతాల్లో పోలీస్ సిబ్బందిని నియమించి వాహనాల రాకపోకలు సజావుగా సాగేలా చూడాల్సి ఉన్నా సిబ్బంది కొరతతో నియమించడం లేదు. దీంతో వాహనాలు ఇష్టారీతిలో రాకపోకలు సాగించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పట్టణ ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు చొరవచూపి ట్రాఫిక్ సిగ్నల్ పరికరాలకు మరమ్మతు చేయించడంతో పాటు, కూడళ్ల వద్ద పోలీస్ సిబ్బందిని ఉంచి వాహనాల రాకపోకలను నియంత్రించాల్సిన అవసరం ఉందని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# జర.. 'తల'కెక్కించుకోండి!



కరీంనగర్ : కరీంనగర్- వెల్గటూరు మార్గంలో ఆర్నెల్ల కిందట ద్విచక్ర వాహనం పైనుంచి పడి ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. గత నెల ఎలిగేడు మండలంలో ముగ్గురు యువకులు వేర్వేరు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారు. మూణ్నెళ్ల కిందట గోదావరిఖని పట్టణంలో ద్విచక్ర వాహనం గోడకు ఢీకొని ఇద్దరు యువకులు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో నెల కిందట ఇద్దరు యువకులు రహదారి ప్రమాదాల్లో దుర్మరణం చెందారు. వీరందరూ తలకు శిరస్త్రాణం లేక తలకు గాయాలై చనిపోయినవారే.

ఏడాది కిందట శంకరపట్నం మండలం మక్తాకు చెందిన 33 ఏళ్ల యువకుడు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా పాలవ్యాన్ ఢీకొట్టింది. దీంతో వాహనంపై నుంచి ఎగిరి కిందపడ్డాడు. వాహనం నుజ్జునుజ్జయింది. తలకు శిరస్త్రాణం ఉండటం వల్ల కేవలం చిన్నచిన్న గాయాలతో బయటపడ్డాడు. 'రూ.15- 20వేలు పెట్టి చరవాణి కొంటేనే.. దానికి స్క్రీన్ గార్డు (రక్షణ తెర) వేయిస్తాం. అలాంటిది నిండు నూరేళ్లు బతకాలని కోరుకునేవారు ద్విచక్రవాహనంపై వెళ్తుంటే శిరస్త్రాణాన్ని ఎందుకు ధరించరు?'

అతి వేగం.. నిబంధనలు పాటించకపోవడం రోడ్డు ప్రమాదాలకు కారణమవుతుండగా ఏటా వందలాది మంది చనిపోతున్నారు. ప్రమాదాల్లో మృతి చెందుతున్న ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించని వారే ఎక్కువగా ఉంటున్నారు.

శిరస్త్రాణం వాడకంలో ఇవన్నీ అపోహలే..

జుట్టు ఊడిపోతుంది.

మెడ నొప్పి, తలనొప్పి వస్తుంది.

పక్కన వాహనాలు కనిపించవు.

చెవులకు ఇబ్బందిగా ఉంటుంది.

**వాస్తవాలివీ..**

ఎక్కువసేపు ధరించడం వల్ల వచ్చే చెమటతో తలపై జుట్టున్న భాగం అపరిశుభ్రంగా మారుతుంది. దీంతో దురదపెట్టడం, చుండ్రు పెరగడం, జుట్టు ఊడటం లాంటి సమస్యలొస్తాయి. శిరస్త్రాణం లోపలి భాగాన్ని ఎప్పటికప్పుడు శుభ్రపర్చుకోవాలి. మంచి కాటన్ చేతి రుమాలు తలకు కట్టుకుని పై నుంచి శిరస్త్రాణం ధరించాలి.

మీ తలకన్నా తక్కువ పరిమాణమున్నది ధరిస్తే బిగుతుగా ఉండి తలనొప్పి వచ్చే వీలుంది. శిరసు చుట్టుకొలత ఆధారంగా కొనాలి.

ఐఎస్ఐ ప్రమాణాలతో ఉన్న నాణ్యమైన వాటిని కొనుగోలు చేయాలి.

సులభంగా తల తిప్పగలిగే సౌలభ్యం ఉండాలి.

ఎక్కువ సేపు ద్విచక్ర వాహనాన్ని నడపడం.. గుంతలు, వేగ నిరోధకాలు వచ్చినప్పుడు వాహన వేగం తగ్గించకపోవడంతో మెడ, వెన్ను నొప్పులు వస్తాయి.

సీటుపై ఒక పక్కకు వంగి కూర్చోవడం, బండి హ్యాండిల్ సరిగ్గా లేకపోవడం వల్లా మెడ, వెన్ను నొప్పి సమస్యలు వస్తాయి.

**ఇదీ పరిస్థితి..**

ఉమ్మడి జిల్లాలో 91 శాతం ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించడం లేదు.

రోడ్డు ప్రమాదాల్లో 60-70 శాతం ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం లేకనే తీవ్రంగా గాయపడుతున్నారు.

తలకు తగిలే గాయాలను నిరోధించడంలో శిరస్త్రాణం పాత్ర 42 శాతం ఉంటుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక వెల్లడించింది.

మెదడు సున్నితమైనది..

మెదడు వెన్నముద్దంత సున్నితంగా ఉంటుంది. దీన్ని రక్షించేందుకు మెదడు చుట్టూ కపాలం ఉన్నా అది కొంతవరకే రక్షణ ఇస్తుంది. ద్విచక్రవాహనాలపై నుంచి పడినవారిలో ఎక్కువగా తలకు బలంగా గాయమవుతుంది. శరీరంలో ఏ భాగానికి గాయమైనా మళ్లీ అతుకుతుంది. తలకు మాత్రం అలా కాదు. మెదడుతో ముడిపడి ఉండటం, నరాల వ్యవస్థ దెబ్బతినడంతో తల భాగాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి. తల, మెదడు ప్రాంతంలో ఎక్కడ బలమైన గాయమైనా కోమాలోకి వెళ్లడం, ఇతర నాడీ వ్యవస్థ దెబ్బతినడంలాంటి పరిస్థితులు ఎదురవుతాయి. అందుకనే తలను రక్షించుకోవాలి.

డాక్టర్ బోగ వెంకటేశ్, న్యూరోసర్జన్, కరీంనగర్

# పట్టణ ప్రగతికి అడ్డంకులు



కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో పట్టణ ప్రగతి నిధులు నిలిచిపోవడంతో అభివృద్ధి పనులకు అడ్డంకులు ఏర్పడ్డాయి. గతేడాది నుంచి నయాపైసా రాకపోవడం, చేపట్టిన పనులకు రూ.కోట్లు చెల్లించాల్సి రావడంతో సగం మేర పూర్తయిన పనులు అలాగే ఉండి వెక్కిరించే పరిస్థితి వచ్చింది.

నగరంలో ఆధునిక హంగులతో కొత్త మార్కెట్లు, అమృత్ వర్షిణి ఆడిటోరియం పనులు చేసేందుకు పట్టణ ప్రగతి, స్మార్ట్‌సిటీ, సీఎంఏ నిధులను కేటాయించారు. ప్రధానంగా పట్టణ ప్రగతి, ముఖ్యమంత్రి హామీ నిధులతో కిసాన్‌నగర్, కలెక్టర్ క్యాంపు కార్యాలయం ఎదుట నిర్మించే సమీకృత మార్కెట్లతోపాటు ఎస్ఆర్ఆర్ కళాశాల సమీపంలో ఆడిటోరియం నిర్మాణ పనులు ఉన్నాయి. పద్మనగర్, కశ్మీర్‌గడ్డలో నిర్మించే వాటికి స్మార్ట్‌సిటీలో నిధులు కేటాయించారు. పద్మనగర్‌లో ప్రారంభోత్సవానికి సిద్ధం అవుతుండగా, కశ్మీర్‌గడ్డలో ఫిల్లర్ల దశలో ఉంది. మిగతాచోట్ల పురోగతి లేకపోవడంతో మొండి గోడలుగా మిగిలిపోయేలా తయారయ్యాయి. నిధులు కేటాయిస్తే అవి ప్రజలకు, వ్యాపారులకు సౌకర్యంగా మారుతాయి.

**నిర్ణయం ఏమిటో?**

కిసాన్‌నగర్, కలెక్టర్ క్యాంపు కార్యాలయం, ఆడిటోరియం పనులు దాదాపు తుది దశలోనే ఉన్నాయి. ఇప్పటికే రూ.కోట్లు వెచ్చించారు. కిసాన్‌నగర్‌లోని సమీకృత మార్కెట్ విషయంలో మాత్రం అంచనాలకు మించి బిల్లులు రికార్డు చేశారనే ఫిర్యాదులు కూడా ఉన్నాయి. దీనిపై రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఫిర్యాదులు వెళ్లగా విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం. మరోవైపు శ్లాబులు, గోడలు పూర్తి చేసిన చోట వదిలేయడం విమర్శలకు దారి తీస్తోంది. ప్రజాధనం వృథా చేసి నిరుపయోగంగా మార్చుతున్నారని ప్రజలు ఆగ్రహిస్తున్నారు. నిధులు కేటాయించి పనులు చేయాల్సి ఉండగా అధికారులు, పాలకులు పట్టనట్లుగా ఉంటున్నారు.

**ఇదీ పరిస్థితి**

రూ.10.05 కోట్లతో కశ్మీర్‌గడ్డ రైతుబజారు స్థలంలో సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

రూ.5.80 కోట్లతో కిసాన్‌నగర్‌లోని వ్యవసాయ మార్కెట్‌లో 1.88 ఎకరాల స్థలంలో జీం1లో 146 దుకాణాలు, పార్కింగ్ వంటి సౌకర్యాలతో నిర్మించేందుకు శ్లాబులు, దుకాణాల అరలు నిర్మించారు. అక్కడికే ఆ పనులు నిలిచిపోయాయి.

రూ.14.05 కోట్లతో పద్మనగర్‌లో 2.08 ఎకరాల స్థలంలో 239 దుకాణాలతో మార్కెట్ నిర్మాణ పనులు తుది దశకు చేరాయి.

కలెక్టర్ క్యాంపు కార్యాలయం ఎదుట 2.31 ఎకరాల స్థలంలో మొత్తం 347 దుకాణాలతో నిర్మించాల్సి ఉండగా శ్లాబులు వేసి వదిలేశారు.

ఎస్ఆర్ఆర్ కళాశాల సమీపంలో నిర్మిస్తున్న ఆడిటోరియం పనులు 58 శాతం పూర్తయ్యాయి. మిగతా పనులు ఆగిపోయాయి.

సమీకృత మార్కెట్లు, ఆడిటోరియం నిర్మాణాలు నిలిచిపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారాయి.

కిసాన్‌నగర్ మార్కెట్ ప్రాంతంలో మందుబాబులు, ఇతరులు అందులోనే ఉంటున్నారు. పైగా టైల్స్, గోడలు పగులకొడుతున్నారు.

మధ్యలోనే ఆగిన ఆడిటోరియం

ఎస్ఆర్ఆర్ కళాశాల సమీపంలో ఆడిటోరియం నిర్మాణం అచ్చి రావడం లేదు. గతంలో కూడా పిల్లర్లు వేసి కొన్నేళ్లు వదిలేశారు. ఇప్పుడు కూడా శ్లాబులు వేసి, గోడలు నిర్మించి మిగతా పనులు చేయకుండా వదిలేయడంతో అక్కడ ఆడిటోరియం నిర్మించేందుకు అడ్డంకులు తప్పడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# పనులు నిలిచి.. ఆయకట్టు పడకేసి

సిరిసిల్ల: మెట్ట ప్రాంతమైన జిల్లాకు సాగునీరందాలంటే ఎత్తిపోతలే శరణ్యం. దిగువన మధ్యమానేరు నుంచి ఎగువ మానేరును కాళేశ్వరం లింక్-3లో 9వ ప్యాకేజీ కలుపుతుంది. ప్రాజెక్టు రీడిజైన్‌లో సామర్థ్యంతోపాటు నిర్మాణ వ్యయం రెండింతలు పెరిగింది. ప్రస్తుతం 83 శాతం పనులు పూర్తయ్యాయి. కొన్ని పనులు మాత్రమే మిగిలాయి. దీంతో జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో 86 వేల ఎకరాలకు సాగునీరందుతుంది. రాష్ట్ర బడ్జెట్‌లో కాళేశ్వరం అసంపూర్తి పనులకు రూ.320 కోట్లు కేటాయించింది. వాటిలో 9వ ప్యాకేజీ అసంపూర్తి పనులను పూర్తి చేయాల్సి ఉంది. ఏడాదిగా ఇక్కడి పనుల్లో ఎలాంటి కదలికలేదు. పనులు ఇలా...మధ్యమానేరు జలాశయం నుంచి ఏడాదిలో 120 రోజుల్లో 11.63 టీఎంసీలు ఎగువమానేరుకు తరలిస్తారు. తొలి దశలోని మూడు టీఎంసీల సామర్థ్యంతో మల్కపేట జలాశయం, పంపుహౌస్‌లో రెండు పంపుల ట్రయల్‌రన్ విజయవంతమైంది. జలాశయం సామర్థ్య పరీక్షలో భాగంగా గతేడాది ఒక టీఎంసీ నీటిని నింపారు. ఈ ఏడాది మరో టీఎంసీ నింపాల్సి ఉంది. దీనిపై ఇటీవల విప్ ఆది శ్రీనివాస్, ఈఎన్‌సీ అనిల్‌కుమార్ అసంపూర్తి పనులపై స్థానిక ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. మల్కపేట నుంచి సింగసముద్రం వరకు కాల్వ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. గంభీరావుపేట మండలం నాగంపల్లిలో పంపుహౌస్ నిర్మాణం, అందులో రెండు మోటార్లు బిగించాల్సి ఉంది. ఇక్కడి నుంచి పైపులైను, కాల్వల ద్వారా బట్టలచెరువు అక్కడి నుంచి ఎగువమానేరులోకి నీటిని తరలించాలి. ఈ పనులన్నీ అసంపూర్తిగా ఉన్నాయి. మల్కపేట జలాశయం కుడి కాల్వ నిర్మాణం కొంతమేరకు జరిగింది. ఎడమ కాల్వ ప్రారంభంలోనే భూసేకరణ చేపట్టాలి. ఈ రెండు కాల్వల పనులు నిలిచిపోయాయి. జలాశయం ఎగువన ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ నుంచి అప్రోచ్ కాల్వ ద్వారా మైసమ్మ చెరువు, అక్కడి నుంచి సింగసముద్రం వరకు కాల్వ పనులు పూర్తయ్యాయి. దీనికి అయిదు డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయి. వీటిలో 1, 3 డిస్ట్రిబ్యూటరీల్లో కొంత మేరకు భూసేకరణ జరిగింది. పరిహారం చెల్లింపులకు రూ.52 కోట్లు అవసరం. ఇవి చెల్లిస్తేనే కాల్వల పనులు ముందుకు సాగుతాయి. జలాశయంలో నీటిని నింపితే ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట మండలాల్లోని గ్రామాలకు యాసంగిలో సాగునీటికి ఇబ్బందులు తప్పుతాయి. మల్కపేట పంపుహౌస్‌లోని రెండు పంపుల ట్రయల్‌రన్ జరిగిన కొన్ని నెలలకే గుత్తేదారు సంస్థ శిబిరాలకు తాళం వేసి అందులో పని చేసే వారంతా వెళ్లిపోయారు. ఏడాదిగా ఈ ప్యాకేజీలో ఎక్కడా పనులు జరగడం లేదు. నివేదికలు పంపాం ఇప్పటి వరకు జరిగిన పనులు, మేరకు నివేదిక తయారు చేశాం.

# స్వాతంత్ర్య స్ఫూర్తి.. సేవా దీప్తి

తిమ్మాపూర్: శారీరకంగా, మానసిక ఎదుగుదల లేని వందలాది మంది పిల్లల అభ్యున్నతికి స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ నిరంతరం పరితపిస్తుంది. తిమ్మాపూర్ మండలంలోని మహాత్మా నగర్ (ఎల్ఎండీ కాలనీ)లో మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల మరియు వయోజన విద్యా కేంద్రం ఉండగా.. సుమారు 130 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తూ వృతి విద్యా కోర్సుల్లోనూ శిక్షణ తీసుకుంటున్నారు. 34 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. అయితే ఈ పాఠశాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుండగా.. ఏటా అరకొరగా మాత్రమే విడుదల అవుతున్నాయి. ప్రతిపాదనలు పంపినా.. స్పందన లేదని నిర్వాహకులు చెబుతున్నారు.

**ట్రస్టు ప్రస్థానం ఇలా..**

దివంగత కేవీ నర్సింగారావు స్ఫూర్తితో స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న పలువురు 1989లో జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ స్థాపించారు. 1990లో ఎనిమిది మంది విద్యార్థులు, ఇద్దరు సిబ్బందితో కరీంనగర్‌లో మానసిక వికలాంగుల పాఠశాలను ప్రారంభించారు. ప్రభుత్వం రెండు ఎకరాల స్థలం కేటాయించడంతో దాతల సహకారంతో తిమ్మాపూర్‌లో భవనాలు నిర్మించారు. 2009 నుంచి విద్యార్థులకు



పలు కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నారు. ప్రస్తుతం వారి వారసులు ట్రస్టు కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. ఏటా రూ.లక్షల్లో నిధులు ట్రస్టుకు ఖర్చు అవుతున్నాయి.

**శిక్షణతోపాటు వచ్చిన ఆదాయం..**

ఈ పాఠశాలలో చేరడానికి పిల్లలకు సదరం ధ్రువీకరణ పత్రం ఉంటే సరిపోతుంది. ఎవరైనా ఇందులో చేరవచ్చు. పిల్లలకు స్పీచ్ థెరపీ, యోగ, నృత్యాలు, ఫిజియోథెరఫీ, ప్రతి శనివారం దేవాలయ సందర్శన చేయిస్తుంటారు. పేపర్ ప్లేట్ల తయారీ, క్యాండిల్స్ తదితర తయారీలో శిక్షణ ఇస్తున్నారు. ఇందులో వచ్చిన ఆదాయాన్ని వారికే ఇస్తున్నారు. ఆసక్తి గల పిల్లలకు కరాటేలో సైతం శిక్షణ అందించగా జాతీయస్థాయిలో రాణించారు.

**నిధులకు ప్రభుత్వం కృషిచేయాలి**

పదేళ్లుగా ఈ పాఠశాలకు ఛైర్మన్‌గా ఉంటున్నా.. మొదటి నుంచి పాఠశాల నిర్వహణకు నిధుల కొరత ఉంది. కొంతమంది దాతలు చేయూత అందిస్తున్నారు. గత సంవత్సరం రూ.80 లక్షల ఖర్చయిందని కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపిస్తే కేవలం రూ.16 లక్షలు మాత్రమే వచ్చాయి. ఈ విషయాన్ని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాను. నిధుల విడుదలకు తగిన చర్యలు తీసుకోవాలి. చాడ వెంకటరెడ్డి, పాఠశాల ఛైర్మన్

# రైతు విత్తనానికి ప్రాధాన్యం

జగిత్యాల : జిల్లాలో వానాకాలంలో 3.16 లక్షల ఎకరాల్లో ప్రధాన పంటగా పండించిన వరిపంట నూర్పిడి చేపడుతుండగా ఇదే తరుణంలో విత్తన సేకరణకు సమయం అత్యంత అనువుగా ఉంది. సూటిరకాలైన నువ్వులు, వరి, పెసర, మినుము, అలసంద తదితరాల్లో ప్రతి పంటకు రైతులు నూతనంగా విత్తనాన్ని కొనాలన్న ఆలోచనను మార్చాలనే ఉద్దేశంతో 2017 ఏప్రిల్‌లో రాష్ట్రంలోనే తొలిసారిగా జగిత్యాల జిల్లాలో అధికారులు 'మన ధాన్యం - మన విత్తనం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టగా చాలామంది రైతులు ఈ విధానాన్ని ఇప్పటికీ అనుసరిస్తున్నారు.

జిల్లాలో నీటిలభ్యతతో ఈ యాసంగిలోనూ వరిని 3.03 లక్షల ఎకరాల్లో పండిస్తారని అధికారులు అంచనా వేశారు. ఈ నేపథ్యంలో ప్రతి హెక్టారుకు రూ.2,400 నుంచి రూ.5,800 వరకు ప్రైవేటు కంపెనీల విత్తనాలకు వెచ్చించాల్సి ఉండగా వరి పండించే రైతుల్లో సగానికిపైగా రైతువిత్తనాన్ని వాడుకునే వీలుంది. దీంతో ఒక పంటకు కనీసం రూ.11 కోట్ల వరకు విత్తన ఆదాచొప్పున సాధారణ పరిస్థితుల్లో రైతులకు ఏటా రూ.22 కోట్ల వరకు మిగలనుంది. ప్రస్తుతం వానాకాలంలో పండించిన వరిధాన్యంలో నుంచి విత్తన గింజలను తీసుకుని రైతులు యాసంగిలో రైతువిత్తనంగా వాడుకోవచ్చు.

రైతు విత్తనాన్ని వాడుకున్నపుడు కల్తీ, నకిలీల బెడద ఏమాత్రం ఉండదు. మన నేలల్లోనే పండించిన పంటకాబట్టి స్థిరమైన దిగుబడికి




అవకాశం ఉంటుంది. విత్తనఖర్చు తగ్గటంతో పాటుగా తోటి రైతులకు విత్తనాన్ని విక్రయించి అధిక ఆదాయం పొందవచ్చు. పొలంపై కల్తీకర్రలు, బెరకు కర్రలను తీసివేస్తూ వేరుగా నూర్పిడి చేసుకోవటం ద్వారా ఎన్ని పంటలకైనా సూటిరకం విత్తనాన్ని రైతు విత్తనంగా వాడుకోవచ్చు. వరితో పాటుగా ఇతర పంటల్లోనూ సొంతవిత్తు లాభాల సొత్తుగా ఉంటుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

సొంతపంటను విత్తనంగా వాడుకోవచ్చు

సూటిరకాల్లో రైతు పండించిన పంటనే శుద్ధిచేసి తిరిగి విత్తనంగా విక్రయిస్తారు. విలువైన తమ పంటను పూర్తిగా మార్కెట్‌లో అమ్మకుండా సొంతవిత్తనంగా వాడుకోవచ్చు. ఆహార ధాన్యాలు, పప్పుదినుసులు, నూనెగింజలు తదితర పంటల్లో రైతువిత్తనం వాడుకుంటే రైతులకు ఆర్థిక ఆదా అవుతుంది.

సీహెచ్.రాంచందర్, జిల్లా వ్యవసాయాధికారి

సంకరాలు, సూటిరకాల్లో తేడాను గుర్తించాలి


మక్క, కూరగాయలు, పత్తి తదితరాల్లో ఆడ, మగవరుసల్లో గింజలు వేసి విత్తనాలను ఉత్పత్తి చేస్తారు కాబట్టి ఈ హైబ్రిడ్స్‌ను ప్రతిపంటకూ తీసుకోవాలి. కానీ వరి, నువ్వులు, పెసర, మినుము, తదితర పంటల సూటిరకాల్లో రైతులు పండించిన ప్రతిగింజ విత్తనంగా వాడవచ్చు.

డాక్టర్ బి.శ్రీనివాస్, శాస్త్రవేత్త

# వైద్య పరీక్షలతోనే మహమ్మారి కట్టడి

గోదావరిఖని : క్యాన్సర్ మహమ్మారిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వైద్య ఆరోగ్య శాఖ తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. ప్రజల్లో అవగాహన పెరుగుతుండటంతో ముందస్తుగానే లక్షణాలను గుర్తించి చికిత్స పొందుతూ త్వరితగతిన క్యాన్సర్‌ను జయిస్తూ మెరుగైన జీవనయానం సాగిస్తున్నారు. 'ముందస్తుగా గుర్తించడం... అవగాహన పెంచుకోవడం, క్యాన్సర్‌తో కలిసి పోరాడుదాం...' నినాదాలతో ప్రపంచ ఆరోగ్య సంస్థ అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం వల్లే చాలామంది వ్యాధి బారిన పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గ్లోబల్ క్యాన్సర్ అబ్జర్వేటరీ సంస్థ గణాంకాల ప్రకారం 2020లో దేశంలో 19.3 మిలియన్ క్యాన్సర్ కేసుల నమోదుతో భారతదేశం ప్రపంచంలో మూడో స్థానంలో నిలిచింది. 2040 నాటికల్లా 57.5 శాతం కేసులు పెరిగే అవకాశముందని సూచించారు. ఈ మేరకు ఎక్కడికక్కడ క్యాన్సర్ వ్యాధిని అరికట్టాలంటే ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు నిరంతరంగా వైద్య పరీక్షలు చేయించుకోవడమే మార్గమని భావించిన ప్రభుత్వం ఇంటింటా అవగాహనకు చర్యలు తీసుకుంటోంది.

**ఇదీ నేపథ్యం** 2014లో అప్పటి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ నవంబర్ 7న జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవంగా ప్రకటించారు. అప్పటి నుంచి ఏటా కార్యక్రమాలు చేపడుతున్నారు. నోబెల్ బహుమతి గ్రహీత మేడమ్ క్యూరీ రేడియం, ఫోలోనియంలను కనుగొనడంతో క్యాన్సర్‌పై పోరాటంలో భారీ



మార్పులు చోటుచేసుకున్నాయి. అందుకే మేడమ్ క్యూరీ జన్మదినమైన నవంబర్ 7న జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవంగా కేంద్రం ప్రకటించింది.

**రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు**

క్యాన్సర్ నివారణలో అవగాహనదే కీలకపాత్రగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎన్.సి.డి.(నాన్ కమ్యూనల్ డిసీజెస్)పై వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటా తిరుగుతూ అవగాహన కల్పించడంతో పాటు వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని ఆసుపత్రులు, పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది నిరంతరంగా ఇంటింటా అవగాహన చేపడుతున్నారు. అనుమానిత కేసులకు సంబంధించి సంపూర్ణ వైద్య పరీక్షలు చేశాకే నిర్ధారణకు వస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అత్యధికంగా రొమ్ము క్యాన్సర్, గర్భాశయ, ఊపిరితిత్తులు, ప్రొస్టేట్, సర్వేకల్, నోటి క్యాన్సర్ కేసులు ఉంటున్నాయి. ఉమ్మడి జిల్లాలోని వివిధ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళా క్లినిక్‌లోనూ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, అవగాహనపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.

**కారకాలివే...**

శరీరంలోని కణాలు అదుపు లేకుండా పెరిగి శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపించడంతో క్యాన్సర్ సోకుతుంది. అతినీలలోహిత కిరణాలు, పొగాకు ఉత్పత్తులను తినడం, అతిగా మద్యం తాగడం, ఆహార, నీటి కాలుష్యం, బ్యాక్టీరియా, ఫంగస్ తదితర క్రిముల వల్ల క్యాన్సర్ వ్యాపిస్తుంది. పెద్దపల్లి జిల్లాలో వివిధ రకాల క్యాన్సర్ బారిన పడిన 271 మంది చికిత్స పొందుతున్నారు. పాలిచ్చే తల్లులకు రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువ. మెనోపాజ్ దశలో మహిళలకు క్యాన్సర్ సోకే అవకాశముంటుంది. దీని బారిన పడ్డవారు అలసటగా ఉండడం, గడ్డలు, చర్మం కింద గట్టిగా అనిపించడం, చర్మం పసుపు, ఎరుపు, నలుపు రంగులోకి మారడం, నయం కాని పుండ్లు, మలవిసర్జన సమయంలో ఇబ్బందులు, నిరంతర దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, నోరు బొంగురు పోవడం, అజీర్తి, కండరాలు, కీళ్ల నొప్పులు, రాత్రి పూట చెమటలు పట్టడం, తీవ్రమైన జ్వరం తదితర లక్షణాలుంటాయి. ఈ లక్షణాలు ఉన్నవారు సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సంప్రదించి అవసరమైన నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి.

**నివారణపై ప్రత్యేక దృష్టి**

డాక్టర్ అన్నప్రసన్నకుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, పెద్దపల్లి క్యాన్సర్ నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా, సార్వజనిక, సామాజిక ఆసుపత్రుల్లో ఆరోగ్య మహిళా కార్యక్రమంలో నిర్ధారణ పరీక్షలు చేయిస్తున్నాం. లక్షణాలు కనిపిస్తే నమూనాలు సేకరిస్తున్నాం. నివేదికల ఆధారంగా స్థానికంగా వారికి వైద్య సేవలు అందిస్తూ వారి ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం.

# ఇక స్టాంపింగ్ తప్పనిసరి

కరీంనగర్: భవన నిర్మాణాల స్లాబ్‌లు, రహదారి నిర్మాణాలకు సంబంధించి ఇసుక, సిమెంటు, కంకర, నీళ్ల తదితరాలను సమపాళ్లలో రెడీమిక్స్ ప్లాంట్‌లలో కలియబెట్టి అవసరమైన చోటుకు వాహనాల్లో తరలిస్తారు. ఇలాంటి ప్లాంట్లకు కూడా ఇక తూనికలు, కొలతల శాఖ నుంచి తప్పనిసరిగా స్టాంపింగ్ (ముద్ర) వేయించుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు ప్లాంట్ల నిర్వాహకులకు అధికారులు నోటీసులు పంపుతున్నారు.

**ఉమ్మడి జిల్లాలో..** ఉమ్మడి జిల్లాలో సుమారు 35 వరకు రెడీమిక్స్ ప్లాంట్లు ఉన్నాయి. కరీంనగర్‌లో దాదాపు 15 వరకు ఉంటాయి. యజమానులు ప్లాంట్లలో ఇసుక, కంకర, సిమెంటు, నీటిని సమపాళ్లలో పోస్తున్నారో లేదో అధికారులు పరిశీలిస్తారు. అన్ని సక్రమంగా ఉంటే ఆ ప్లాంటుకు ముద్ర (స్టాంపింగ్, ధ్రువీకరణ పత్రం) వేస్తారు. కరీంనగర్ జిల్లాలో ఏ ఒక్క ప్లాంటుకు కూడా స్టాంపింగ్ జరగలేదని అధికారులు తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో మాత్రం కొన్నింటికి స్టాంపింగ్ జరిగినట్లు సమాచారం.

**నోటీసులు జారీ..**

రెడీమిక్స్ ప్లాంట్లకు సంబంధించి ఫిర్యాదులు వస్తుండటంతో అధికారులు ఆయా ప్లాంట్ల యజమానులు నోటీసులు జారీ చేస్తున్నారు. నెల రోజుల్లో స్టాంపింగ్ చేయించుకోవాలని గడువు విధిస్తున్నట్లు తెలిసింది. ప్రతీ యజమాని తమ ప్లాంటుకు తప్పనిసరిగా స్టాంపింగ్ చేసుకోవాలని సహాయ నియంత్రణాధికారి విజయసారథి స్పష్టం చేశారు. సంబంధిత ధ్రువపత్రం గడువు ఏడాది వరకు ఉంటుందని తెలిపారు. స్టాంపింగ్ చేసుకోకపోతే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

# పర్యవేక్షణ మరచి.. నిఘానేత్రం మసకబారి



సికింద్రాబాద్ : ప్రపంచంలో ఏ మూల ఉగ్రదాడి జరిగినా.. ఏ దేశంలోనైనా నేరం జరిగినా చాలా సందర్భాల్లో నగరానికి సంబంధం ఉంటోంది. ఉగ్రమూకల ఆచూకీ కనిపెట్టాలన్నా.. అంతర్రాష్ట్ర దొంగల ముఠా ఆటకట్టించాలన్నా.. శాంతిభద్రతలు సజావుగా ఉండాలన్నా సీసీ కెమెరాలే ఆధారం. పోలీసుల పరిశోధనకు ఆయువుపట్టు లాంటి వాటిపై నిర్లక్ష్యం అలుముకుంది.

**హైదరాబాద్‌లో..:** ఇటీవల అంబర్‌పేట పరిధిలో జరిగిన జంట హత్యల కేసులో నిందితులెవరనేది తెలియలేదు ఘటన జరిగి 15 రోజులు గడుస్తున్నా చిన్న ఆధారం లభించలేదు. సీసీ టీవీ పరిశీలిస్తే అవి పనిచేయలేదు.

సైబరాబాద్ పరిధిలో నేరాలు ఎక్కువగా జరిగే కుత్బుల్లాపూర్ పరిధిలోని ఓ పోలీస్‌స్టేషన్. ఆ పరిధిలో సగానికి పైగా సీసీ టీవీ కెమెరాలు పనిచేయట్లేదు. పదుల సంఖ్యలో చోరీ కేసుల్లో వేలిముద్రలు దొరకలేదు. అక్కడి కెమెరాల పనితీరు నామమాత్రంగా ఉంటోంది.

రాచకొండ పరిధిలోని ఉప్పల్-తార్నాక ప్రధానమార్గంలో గుర్తుతెలియని వాహనం ఒక వ్యక్తిని ఢీకొట్టి వెళ్లిపోయింది. పోలీసులు రంగంలోకి దిగి దాదాపు 250 సీసీ టీవీ కెమెరాలు పరిశీలించారు. అప్పటికీ కానీ అసలు విషయం గుర్తించలేకపోయారు.. వాటిలో 50 మరమ్మతులకు గురైనట్టు గుర్తించారు.

**రక్షణ ఇలాగేనా:** దేశ, విదేశాల నుంచి లక్షలాది మంది పర్యాటకులు నగరానికి వేలల్లో వచ్చిపోతుంటారు. ప్రయాణికులతో రద్దీగా ఉండే రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు. చార్మినార్, గోల్కొండ, ట్యాంక్‌బండ్, జంతుప్రదర్శనశాల వంటి పర్యాటక ప్రాంతాల్లో సగానికి పైగా సీసీ టీవీ కెమెరాలు పనిచేయట్లేదు.

**కీలక ప్రాంతంలో..:** బేగంబజార్, మోండామార్కెట్, షాహినాయత్‌గంజ్, మలక్‌పేట్, మెహదీపట్నం, అమీర్‌పేట్ వంటి మార్కెట్ ప్రాంతాల్లో నిఘానేత్రాలు నామమాత్రమే.

**ప్రయాణికుల భద్రతేదీ..?:** సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో 84 సీసీటీవీ కెమెరాలున్నా రికార్డింగ్‌లో నాణ్యత లేదు. నిల్వ సామర్థ్యం మచ్చుకైనా కనిపించదు. రైల్వేస్టేషన్ చుట్టుపక్కల గోపాలపురం, మోండామార్కెట్‌ల్లో 300 కెమెరాల్లో 80 మొరాయించాయి.

**ఇంత దారుణమా:** ప్రధాన ఆసుపత్రులు నిమ్స్, గాంధీ, నిలోఫర్, ఉస్మానియా వంటిచోట్ల పరిస్థితి మరీ దారుణం.. కేవలం 10శాతం మాత్రమే పనిచేస్తున్నాయి.

గాంధీఆసుపత్రి, గాంధీనగర్ పరిధిలో 232లో 156 ఉన్నా లేనట్లే. ఒక్కటీ సరిగా లేవు. చిలకలగూడ ఠాణా పరిధిలో 6874 కెమెరాల్లో 3వేలు పనిచేయడం లేదు.

ఎవరూ వస్తున్నారో...!: మెహిదీపట్నం ప్రధాన రహదారి పీవీ ఎక్స్‌ప్రెస్ పిల్లర్ నంబరు 16, ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ 28 వద్ద కూడా సీసీ కెమెరాలు కొన్ని నెలలుగా మొరాయిస్తున్నాయి. ఎన్ఎండీసీ, మాసాబ్‌ట్యాంక్ చౌరస్తాలతో పాటు మెహిదీపట్నం రైతుబజార్ బస్‌స్టాపులో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. గుడిమల్కాపూర్ వివేకానంద చౌరస్తా, సౌత్‌వెస్ట్‌లో 'నేను సైతం'లో 198 సీసీ కెమెరాలున్నా సగమే ఉపయోగపడుతున్నాయి.

**నగరం నలుదిక్కులా.. ఇంతే**

అల్వాల్‌లో 8వేల కెమెరాల్లో 20శాతం (బొల్లారం- బృందావన్ కాలనీ కూడలి) పనిచేయక 6 నెలల దాటింది.

బాలానగర్ ఠాణా పరిధిలో బాలానగర్ ప్రధాన రహదారి, ఐడీపీఎల్, గుడెన్‌మెట్, ఫిరోజ్‌గూడ, ఐడీఎల్‌రోడ్, ఉషాముళ్లపూడి మార్గాల్లో 70శాతం పనిచేయడం లేదు. ః సైబరాబాద్‌లో కీలకమైన కూకట్‌పల్లి ఠాణా పరిధిలో 2,380 కెమెరాల్లో 2150, కేపీహెచ్‌బీ కాలనీలో 1000లో 600 మాత్రమే పనిచేస్తున్నాయి. ఇక్కడి 50 కాలనీల్లో 10 కాలనీల్లో మాత్రమే నిఘా నేత్రాల జాడ కనిపిస్తుంది.

ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దాతలు, స్వచ్ఛంద సంస్థలతో ఏర్పాటు చేసిన సీటీ టీవీ కెమెరాల్లో 60శాతం మూలనపడ్డాయి. ప్రైవేటు వసతి గృహాలున్న లక్ష్మారెడ్డి కాలనీలో సుమారు 40 సీసీ కెమెరాల్లో 90శాతం పని చేయడం లేదు. చిలుకానగర్ డివిజన్‌లో పనితీరు అంతంతమాత్రమే.

నార్సింగి ఠాణా పరిధిలో కమ్యూనిటీలో 1018, నేను సైతంలో 10,723 కెమెరాలు ఏర్పాటు చేశారు. 369 అక్కరకు రావడం లేదు. రాయదుర్గం ఐటీ కారిడార్ పరిధిలో 800 సీసీ టీవీ కెమెరాల్లో మణికొండ, పంచవటీకాలనీ, గచ్చిబౌలి, అంజయ్యనగర్, ల్యాంకోహిల్స్ ఖాజాగూడల్లో కీలకమైనచోట్ల 80శాతం మొరాయించాయి.

# చెప్పిందొకటి.. చేసేదొకటి



హైదరాబాద్ :గత సర్కారు పేద, మధ్య తరగతి ప్రజలకు కల్పించిన ఆస్తిపన్ను రాయితీ పథకాన్ని జీహెచ్ఎంసీ రద్దు చేసింది. పన్ను సవరణ పేరుతో.. లబ్ధిదారుల మెడపై కత్తి పెడుతోంది. మీకు రూ.101 ఆస్తిపన్ను పథకం వర్తించదని, ఇకపై పూర్తిస్థాయిలో పన్ను చెల్లించాలంటోంది. మరీ దారుణంగా.. గడిచిన రెండున్నరేళ్ల కాలానికి పెంచిన పన్ను మొత్తాన్ని చెల్లించాలని నోటీసులిస్తోంది. కొందరు సర్కిళ్ల ఉప కమిషనర్లు, సహాయ మున్సిపల్ కమిషనర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్ల చేతివాటంలోనే నోటీసుల పరంపర కొనసాగుతోందనే విమర్శలొస్తున్నాయి.

**పథకానికి పాతర**

ఆస్తిపన్ను రూ.1200ల లోపు ఉన్న నిర్మాణాలకు 2017లో ప్రభుత్వం పన్ను రాయితీ ఇచ్చింది. ఆ పరిధిలోని యజమానులంతా ఏడాదికి రూ.101 పన్ను చెల్లిస్తే సరిపోతుందని అప్పటి సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. ఆమేరకు జీహెచ్ఎంసీ పథకాన్ని అమలు చేసింది. తద్వారా.. జీహెచ్ఎంసీకి రూ.100 కోట్ల వార్షిక ఆదాయానికి గండి పడింది. లోటును భర్తీ చేసుకునేందుకు.. జీహెచ్ఎంసీ ఏడాది తర్వాత సునామీ సర్వే చేపట్టింది. వాస్తవ విస్తీర్ణాన్ని తక్కువ చూపించి, రూ.101 పథకాన్ని అనుభవిస్తోన్న వేలాది నిర్మాణాలను గుర్తించి పన్ను సవరించడంతో లోటు భర్తీ అయింది.

ఈ ఏడాది జూన్‌లో ఆస్తిపన్నుకు సంబంధించి.. వాణిజ్య కేటగిరీలో విద్యుత్తు కనెక్షన్లు ఉన్న నిర్మాణాలు, 'సున్నా' విస్తీర్ణం కింద పన్ను చెల్లించే భవనాలు, ఆస్తిపన్ను సున్నా రూపాయలుగా ఉండే నిర్మాణాలు, రూ.101 పన్ను పథకాన్ని పొందుతోన్న వ్యాపార కేంద్రాలకు మాత్రమే నోటీసులిచ్చి పన్ను వాస్తవీకరించాలని కేంద్ర కార్యాలయం ఆదేశించింది. అయితే సర్కిళ్ల అధికారులు వీటితోపాటు రూ.101 పన్ను పథకానికి అర్హత ఉన్న ఇళ్లకు కూడా నోటీసులివ్వడంతో నివాసితులు తీవ్రఆందోళన చెందుతున్నారు.

కూకట్‌పల్లి అధికారులను వివరణ కోరగా.. "కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్లలో ఆస్తిపన్ను సర్వే జరుగుతోంది. కూకట్‌పల్లి సర్కిల్‌లో 676, మూసాపేట సర్కిల్‌లో 595ఇళ్లను పరిశీలించాం. పెరిగిన పన్ను విలువతో డిమాండ్ నోటీసులు ఇచ్చాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికే కాకుండా.. గత రెండున్నరేళ్లకు కూడా పన్ను వసూలు చేసే అధికారం జీహెచ్ఎంసీకి ఉంది" అని తెలిపారు.

# కల్లం.. రైతన్న కల్లోలం

తాండూరు : 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' కింద జిల్లాలో నిర్మించ తలపెట్టిన పంట కల్లాల నిర్మాణం నిర్ణీత లక్ష్యం చేరుకోలేదు. దీంతో రైతులు రహదారులు, ఖాళీ స్థలాలు తదితరాలపై ఆధారపడాల్సి వస్తోంది. కొన్నిచోట్ల ప్రభుత్వ ఆర్థిక సాయంతో రైతులు స్వయంగా నిర్మించుకున్న వాటిని జాగ్రత్తగా కాపాడుకోవడంతో నేటికీ వారికి ఉపయోగపడుతున్నాయి. కాకపోతే ఇలాంటివి పదుల సంఖ్యలో కూడా లేకపోవడం గమనార్హం.

**జాబ్ కార్డు నిబంధన అవరోధం**

కేంద్ర ప్రభుత్వం 2019-2020లో జిల్లాలోని అన్ని మండలాల్లో ఉపాధి హామీ జాబ్ కార్డులున్న రైతులు కల్లాలు నిర్మించుకునేలా నిబంధన విధించింది. ఒక్కో కల్లం నిర్మాణానికి సామగ్రి తరలించే దూరం, కూలీల ఖర్చును బట్టి రూ.85,366 అంచనా వ్యయంగా నిర్ణయించింది. ఈ నిబంధనతో చాలా మంది రైతులు నిర్మాణాలు చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది.

**దెబ్బతీసిన బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం**

ప్రారంభంలో కొందరు రైతులు ఉత్సాహం చూపారు. తీరా కల్లాల నిర్మాణం పూర్తయ్యాక బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరిగి రైతులు చొరవ చూపడం మానేశారు. అలాగే ఉపాధి జాబ్ కార్డు ఉన్న కొందరు రైతుల్లో అర ఎకరం నుంచి మూడెకరాల భూములు ఉన్న వారే ఎక్కువ. ఇందులో కొంత భూమిని కల్లం నిర్మించేందుకు వినియోగిస్తే దిగుబడులు తగ్గుతాయి. ఇది తమకే నష్టమని కల్లాల నిర్మాణంపై ఆసక్తి చూపలేదు.

పొలాల్లో కల్లాలు నిర్మించుకుంటే ఉత్పత్తుల నూర్పిడి, ఆరబెట్టు కోవడం సౌకర్యంగా ఉంటుందనే విషయమై అధికారులు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారు. దీంతో రైతులు సమీపంలోని రహదారులనే కల్లాలుగా వాడుకుంటున్నారు. జిల్లాలో ప్రస్తుతం కల్లాల నిర్మాణం ఆగిపోయిందని ఉపాధి హామీ పథకం ఉద్యోగులు చెప్పారు.

ఇవీ ప్రయోజనాలు

ఉత్పత్తులను పొలంలోనే నూర్పిడి చేసి ఆరబెట్టుకోవచ్చు.

అక్కడే నేరుగా బస్తాల్లో నింపి విక్రయానికి విపణులకు లేదంటే నిల్వ చేయడానికి ఇళ్లకు తరలించుకోవచ్చు.




వాస్తవంలో ఇదీ పరిస్థితి

ఉపాధి హామీ పథకం కింద నిర్మాణం

శ్రీకారం.. 2019-2020

నిర్దేశించిన యూనిట్లు: 3,557

పూర్తయినవి: 221

కేటాయించిన నిధులు: రూ.26.05 కోట్లు

ఖర్చు చేసింది: రూ.1.10 కోట్లు

ఒక్కో యూనిట్ వ్యయం.. రూ.81వేలు

సొంత నిర్మాణం.. నేటికీ ఉపయోగం

ఆర్థికంగా ప్రోత్సహించడంతో రంగాపూర్‌లో రైతు రాజు నిర్మించుకున్న కలం నేటికీ ఉపయోగపడుతోంది. సర్కారు సహకారానికి తోడు రైతులు తాము కొంత పోగు చేసుకుని చక్కగా నిర్మించుకున్నారు. పరిగి, దోమ మండలాల్లోని బాసుపల్లి, నస్కల్, బసిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో పలువురు రైతులు నేటికీ వాడుకుంటున్నారు.

# కట్టినంత కష్టం

హైదరాబాద్ : జీహెచ్ఎంసీ ప్రణాళిక విభాగాన్ని సిబ్బంది కొరత వేధిస్తోంది. కిందిస్థాయిలో సమస్య నెలకొనడంతో, ఇంటి నిర్మాణ దరఖాస్తులు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. రెండు వారాల్లో మంజూరవ్వాల్సిన అనుమతి.. రెండు, మూడు నెలలైనా రావడం లేదు. దీంతో అనుమతులు లేకుండానే పనులు ప్రారంభిస్తున్నారు.

కొరవడిన పరిశీలన..

టీజీబీపాస్ చట్టం వచ్చాక చిన్న ఇళ్లకు స్వీయ ధ్రువీకరణతో నిమిషాల్లో ప్రాథమిక అనుమతి లభిస్తోంది. రెండు వారాల్లోపు సంబంధిత టీపీఎస్ (టౌన్ ప్లానింగ్ సెక్షన్) అధికారి నిర్మాణ ప్రదేశాలన్ని తనిఖీ చేసి, తుది అనుమతి ఇవ్వాలి. అప్పుడే పనులు చేపట్టాలి. ప్రస్తుతం టీపీఎస్‌ల కొరతతో 80శాతం దరఖాస్తులకు క్షేత్ర స్థాయి పరిశీలన జరగట్లేదు.



**ఎన్‌ఫోర్స్‌మెంట్ నిస్తేజం..**

అక్రమ నిర్మాణాల కట్టడికి జోనల్ కమిషనర్ ఆధ్వర్యంలో ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ బృందాలు నాలుగేళ్లుగా పనిచేయట్లేదు. కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించిన న్యాక్ ఇంజినీర్లకు డివిజన్లలోని నిర్మాణాలను పరిశీలించే బాధ్యత అప్పగించారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ.. పునాది దశలోనే అనుమతిలేని నిర్మాణాలను గుర్తించాలన్నది టాస్క్‌ఫోర్స్ కర్తవ్యం. ఆచరణలో ఈ బృందాలు పడకేశాయి. కొందరు న్యాక్ ఇంజినీర్లు అక్రమ నిర్మాణాల వద్ద వసూళ్లకు పాల్పడుతున్నారు.

**ఏసీపీల స్థాయిలో..**

ఇటీవల ముగ్గురు ఏసీపీలు పదవీ విరమణ చేశారు. ఈ మధ్య కాలంలో జరిగిన రాష్ట్ర స్థాయి బదిలీల్లో జీహెచ్ఎంసీకి ఇద్దరు ఏసీపీ స్థాయి అధికారులను తక్కువ కేటాయించారు. దీంతో జోన్లు, సర్కిళ్ల స్థాయిలో ఏసీపీ, సీపీల కొరత ఏర్పడింది. కూకట్‌పల్లి జోన్‌లో, కేంద్ర కార్యాలయంలోని ఇద్దరు ఏసీపీలకు రెండు బాధ్యతలు, ఇతరత్రా అధికారులకు అదనపు బాధ్యతలు కేటాయించడం గమనార్హం.

# మురుగు పొంగు.. ఇక కనుమరుగు

హైదరాబాద్: హైదరాబాద్ మహానగరంలో మురుగు పొంగే సమస్యలకు శాశ్వత పరిష్కారంగా జలమండలి చేపట్టిన ప్రత్యేక కార్యాచరణ సత్ఫలితాలను ఇస్తోంది. 90 రోజుల్లో నగరాన్ని సీవరేజీ ఓవర్ ఫ్లో ఫ్రీ నగరంగా మార్చడం లక్ష్యంగా అక్టోబర్ 2న లాంఛనంగా ప్రారంభించిన ప్రత్యేక డ్రైవ్ నెల రోజులు పూర్తి చేసుకున్న నేపథ్యంలో జలమండలి ప్రగతిని సమీక్షించింది. ఇప్పటి వరకు 620 కిలోమీటర్ల మేర డ్రైనేజీ పైపులైన్లను శుభ్రం చేయగా.. అత్యధిక ఫిర్యాదులు, తరచూ సమస్యలు వచ్చే మ్యాన్‌హోళ్లపై ప్రత్యేక దృష్టి సారించి పరిశుభ్రతను చేపట్టారు. నెల రోజుల్లో పండగలు, ఇతర ప్రత్యేక పరిస్థితులు ఉన్న నేపథ్యంలో 20 రోజులుగా మ్యాన్‌హోళ్ల క్లీనింగ్ కార్యక్రమం వేగం అందుకుంది. రోజుకు సుమారు 30 కిలోమీటర్ల మేర మురుగు కాలువలను పూర్తిస్థాయిలో శుభ్రం చేస్తున్నారు. సమస్య వచ్చిన చోటే మళ్లీ మళ్లీ మురుగు పొంగుతోంది. ఈ నేపథ్యంలో అటువంటి మ్యాన్‌హోళ్లలో పేరుకుపోయిన మట్టిని పూర్తిగా తొలగించడంతోపాటు మురుగునీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న ఇతర సమస్యలను పరిష్కరిస్తున్నారు. మొదటి మూడు నెలల్లో 30 శాతం తగ్గించేందుకు ఈ కార్యాచరణ చేపట్టారు.

**ఆన్‌లైన్ పర్యవేక్షణ..** క్షేత్రస్థాయిలో జరుగుతున్న మ్యాన్‌హోళ్లను శుభ్రం చేసే పనులను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో పర్యవేక్షించనున్నారు.



జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా జలమండలి ప్రధాన కార్యాలయంలో మేనేజింగ్ డైరెక్టర్ కె.అశోక్‌రెడ్డి ప్రతి పనిని పరిశీలిస్తున్నారు. మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేశారా?.. లేదా? చేస్తే ఎంత మట్టి వచ్చింది?.. ఏ ఎయిర్‌టెక్ యంత్రాన్ని ఎక్కడి పనులకు ఉపయోగించారనే వివరాలను సేకరిస్తున్నారు.సమస్య: మ్యాన్‌హోళ్ల నుంచి సీవరేజీ ఓవర్‌ఫ్లో

మొత్తం సీవరేజీ లైన్లు: 10 వేల కిలోమీటర్లు

నెలకు వస్తున్న సగటు ఫిర్యాదులు : 66 వేలు

సమస్యలు : పూడిక పేరుకుపోవడం, పాత పైపులైన్లు, వ్యర్థాలు

చేపట్టిన చర్యలు

పూర్తిస్థాయిలో పూడికతీత

అవసరమైన చోట కొత్త పైపులైన్ల ఏర్పాటు

పైపులైన్ల సామర్థ్యం పెంపు

ధ్వంసమైన మ్యాన్‌హోళ్ల పునరుద్ధరణ




# శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న సీఎం చంద్రబాబు

కర్నూలు: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివారిని ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తదితరులు దర్శించుకున్నారు. అంతకుముందు పౌర విమానయాన శాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీశైలంలోని పాతాళ గంగలో సీ ప్లేన్ డెమో లాంచ్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ, ఎఫ్ఐసీసీఐ భాగస్వాములుగా ఉన్నారు. శనివారం విజయవాడ పున్నమి ఘాట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు " సీ ప్లేన్" ప్రారంభించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో కలిసి అందులో ప్రయాణించి శ్రీశైలం చేరుకున్నారు. శ్రీశైలం పాతాళగంగలో సురక్షితంగా " సీ ప్లేన్" ల్యాండ్ అయ్యింది. ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, తమ హర్షధ్వానాల మధ్య ముఖ్యమంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. రాష్ట్ర మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డి, కందుల దుర్గేష్, ఆనం రామనారాయణ రెడ్డి, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్ రెడ్డి, చరితా రెడ్డి తదితరులు ముఖ్యమంత్రికి ఘనంగా ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం పాతాళగంగ నుంచి చంద్రబాబు రోప్ వే లో శ్రీశైలం ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీశైల మల్లన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద ఆశీర్వచనం ఇచ్చి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# సామాన్యులకు అందుబాటు ధరల్లో సీ ప్లేన్ ప్రయాణం: కేంద్ర మంత్రి రామ్మోహన్



విజయవాడ: సీ ప్లేన్‌ను అందరికీ అందుబాటులోకి తెస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. మరో 3-4 నెల్లలో ఏపీలో ఈ సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. సామాన్యులకు అందుబాటు ధరల్లో సీ ప్లేన్ ప్రయాణం ఉంటుందని చెప్పారు. ఏపీలో 4 రూట్లలో నడిపేందుకు ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ప్రకాశం బ్యారేజీ వద్ద పున్నమిఘాట్‌కు సీ ప్లేన్ చేరుకుంది. కాసేపట్లో బ్యారేజీ నుంచి శ్రీశైలం వరకు సీఎం చంద్రబాబు ఇందులో ప్రయాణం చేయనున్నారు. దీంతో పున్నమి ఘాట్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తం 14 మంది కూర్చునేలా సీ ప్లేన్ సీటింగ్ ఏర్పాటు చేశారు. ఇందులో ప్రయాణించి సీఎం శ్రీశైలానికి చేరుకోనున్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, పలువురు అధికారులు పాల్గొంటున్నారు.

# డ్రగ్స్.. గత ప్రభుత్వ అవినీతి నుంచి సంక్రమించిన వారసత్వ సమస్య: పవన్ కళ్యాణ్



అమరావతి: ఏపీలో మాదకద్రవ్యాలు పెనుముప్పుగా మారాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. గత ప్రభుత్వ అవినీతి నుంచి ఎన్డీయే కూటమికి సంక్రమించిన వారసత్వ సమస్య ఇది అని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. డ్రగ్స్ మాఫియా, గంజాయి సాగును అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

కొంత కాలం క్రితం విశాఖ ఓడరేవులో కొకైన్ స్వాధీనం చేసుకున్నారని గుర్తుచేశారు. దేశంలోని ఇతరచోట్ల పట్టుబడిన డ్రగ్స్‌కు రాష్ట్రంతో సంబంధాలున్నాయని చెప్పారు. విజయవాడలోని ఒక వ్యాపార సంస్థతో సంబంధాలు బయటకొచ్చాయని తెలిపారు. నేరస్థుల కట్టడికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక అవసరమని పవన్ కల్యాణ్ అన్నారు.

# చంద్రబాబు, లోకేశ్‌పై అనుచిత వ్యాఖ్యలు.. బోరుగడ్డ అనిల్‌పై మరో కేసు



కర్నూలు: రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌ను పోలీసులు పీటీవారెంట్‌పై కర్నూలుకు తీసుకువచ్చారు. సోషల్ మీడియాలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌పై ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆయనపై గతంలో తెదేపా నేత గట్టు తిలక్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కర్నూలు మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో మరో కేసు నమోదైంది. వైకాపా అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో బోరుగడ్డ అనిల్ అరాచకానికి హద్దే లేకుండా పోయింది. పోలీసులు సైతం అతని వైపు చూడాలంటేనే భయపడే పరిస్థితి కల్పించాడు. 2021లో కర్లపూడి బాబుప్రకాష్‌ను రూ. 50 లక్షలు ఇవ్వాలంటూ బెదిరించిన కేసులో ఇటీవల పోలీసులు అతడిని అరెస్టు చేశారు. నల్లపాడు ఠాణాకు తరలించారు. బోరుగడ్డ అనిల్.. జగన్‌కు తొత్తుగా వ్యవహరిస్తూ ప్రతిపక్షాలు, ప్రతిపక్షనేతలపై సభ్యసమాజం తలదించుకునేలా సామాజిక మాధ్యమాలు, టీవీ డిబేట్‌లలో ఇష్టానుసారం దూషణలు చేశాడు. వైకాపా ఐదేళ్ల పాలనలో జగన్‌కు వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడినా వారిపై అసభ్యకర పదజాలంతో విరుచుకుపడేవాడు. జగన్‌ను వ్యతిరేకిస్తూ మాట్లాడితే చంపేస్తానంటూ బెదిరింపులకు దిగేవాడు. చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, లోకేశ్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశాడు. ప్రతిపక్షాలకు చెందిన మహిళల గురించి అసభ్యకరంగా మాట్లాడి దూషించేవాడు.

# వర్రా రవీందర్‌రెడ్డి కేసు.. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పీఏ ఇంటికి పోలీసులు



పులివెందుల: ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు పులివెందులలోని ఆయన ఇంటికి వెళ్లారు. వర్రా రవీందర్‌రెడ్డి కేసు విచారణ నిమిత్తం వారు అక్కడికి వెళ్లారు. వర్రా రవీందర్‌రెడ్డితో అవినాష్ పీఏ రాఘవరెడ్డి మాట్లాడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇంట్లో ఆయన లేరని కుటుంబ సభ్యులు చెప్పడంతో వెనుదిరిగారు. మరోవైపు ఈ విషయమై పులివెందుల అర్బన్ సీఐ జీవన్ రంగనాథ్‌తో లాయర్ ఓబులరెడ్డి మాట్లాడారు. వైకాపా అధికారంలో ఉండగా వర్రా రవీంద్రారెడ్డి అడ్డూ అదుపూ లేకుండా మితిమీరి ప్రవర్తించారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్, వంగలపూడి అనితపై అసభ్యకరమైన పోస్టులు పెట్టారు. ఆయనపై మంగళగిరి, హైదరాబాద్‌లో పలు కేసులున్నాయి. ఆయన్ను పట్టుకునేందుకు పోలీసులు యత్నిస్తున్నారు.

# విశాఖ కేజీహెచ్ కొండపై గంజాయి సాగు కలకలం.. అదుపులో యువకులు



విశాఖ: ఆంధ్రప్రదేశ్‌లో గంజాయి స్మగ్లర్లు రెచ్చిపోతున్నారు. ఏకంగా విశాఖ నడిబొడ్డున గంజాయి సాగు చేయడం కలకలం రేపుతోంది. కేజీహెచ్ కొండపై బాలికల వసతిగృహం వెనుక ఉన్న కొండపై పలువురు స్మగ్లర్లు గంజాయి పండిస్తున్నారు. ఏడాదిన్నరకాలంగా స్మగ్లర్లు కొండపై గంజాయి పండిస్తున్నారు. నేవీ పరిధిలో ఉన్న ప్రాంతంలో గంజాయి సాగు చేయడం ఆందోళన కలిగిస్తోంది. దీనికి సంబంధించి పలువురు యువకులను విశాఖ వన్ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భారీ స్థాయిలో గంజాయిని సాగు చేస్తున్నారని, దీనికి సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దీని వెనక ఎవరున్నారనే దానిపై విచారణ చేస్తున్నట్లు చెప్పారు. ఒక ముఠాగా ఏర్పడి గంజాయి సాగు చేస్తున్నారా.. లేదా ఆకతాయితనంగా చేస్తున్నారా అనే కోణంలో విచారణ చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.




సియోల్: దక్షిణ కొరియా కు చెందిన గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ ను ఉత్తర కొరియా తారుమారు చేయడంతో అక్కడి విమానాలు, ఓడల సర్వీసులకు అంతరాయం కలిగినట్లు ఆ దేశ అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. రెండు రోజులుగా ఉత్తర కొరియా చేస్తున్న పనుల వల్ల తమ విమాన సర్వీసులు, పశ్చిమ సముద్ర ప్రాంతంలో నడుస్తున్న ఓడల రవాణాలో సమస్యలు తలెత్తాయని, ఇకనైనా ఇలాంటి కవ్వింపు చర్యలు మానుకోవాలని దక్షిణ కొరియా జాయింట్ చీఫ్స్ ఉత్తర కొరియాకు హితవు పలికారు.

దీనివల్ల ఏదైనా ప్రమాదం జరిగితే దానికి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఈ ఏడాది మే 29 నుంచి జూన్ 2 మధ్య ఉత్తర కొరియా పంపించే చెత్త బెలూన్ల కారణంగా జూన్ నుంచి తమ రాజధాని సియోల్‌కు చెందిన రెండు విమానాశ్రయాల్లోని రన్‌వేలను దాదాపు 20 రోజుల్లో మూసివేయాల్సి వచ్చిందని, ఆ సమయంలో టేకాఫ్‌లు, ల్యాండింగ్‌లు సమస్యాత్మకంగా మారాయని దక్షిణ కొరియా ప్రభుత్వం తెలిపింది. దీని కారణంగా 500 విమానాలు, వందలాది నౌకలు జీపీఎస్ సమస్యలు ఎదుర్కొన్నట్లుగా ఈ విషయంపై UN ఏవియేషన్ బాడీ ఇంటర్నేషనల్ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్ కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొంది. జామింగ్‌ను ఆపాలని ఈ సంస్థ ఉత్తర కొరియాను హెచ్చరించింది. కాగా ఇటీవల ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. మే చివరివారం నుంచి దక్షిణ కొరియా గగనతలంపైకి వేల సంఖ్యలో చెత్త బెలూన్లు పంపింది. ఈక్రమంలోనే దక్షిణ కొరియాతో తమకున్న సరిహద్దును పూర్తిగా మూసివేస్తున్నట్లు కిమ్ సర్కారు నిర్ణయించింది. అందులోభాగంగా ఇరుదేశాలను కలిపే రోడ్లు, రైల్వే మార్గాలను ఉత్తర కొరియా బాంబులతో పేల్చివేసింది. మరోవైపు ఉత్తరకొరియా సరిహద్దుల వెంబడి నిఘాను పెంచింది. కాగా రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం జరుగుతున్న సమయంలో రష్యాకు మద్దతుగా పెద్దసంఖ్యలో ఉత్తర కొరియా సైనికులు ఆ దేశానికి వెళ్లడాన్ని దక్షిణ కొరియా తీవ్రంగా వ్యతిరేకించింది. అంతేకాకుండా ఉత్తర కొరియా అణు పరీక్షలు నిర్వహిస్తుండటంపై ఆందోళన వ్యక్తంచేస్తోంది.




అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్ విజయం వెనక అపర కుబేరుడు ఎలాన్ మస్క్ పాత్ర గణనీయమే అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ట్రంప్ ప్రచారానికి భారీగా విరాళాలివ్వడమే గాక.. బహిరంగ ర్యాలీల్లోనూ పాల్గొని ఓటర్లను ఉత్సాహపర్చారు. ఈ క్రమంలోనే ట్రంప్ కార్యవర్గంలో మస్క్‌కు కీలక బాధ్యతలు దక్కే అవకాశాలున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. దాన్ని మరింత బలపర్చేలా మరో వార్త బయటికొచ్చింది. ఇటీవల ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడుతుండగా.. ఆ కాల్‌లో మస్క్ కూడా చేరినట్లు తెలుస్తోంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలో ఎలాన్ మస్క్ ఫ్లోరిడాలోని ట్రంప్ నివాసంలో ఆయనతో కలిసే ఉన్నారు. ఆ సమయంలో ఎన్నికల్లో విజయం సాధించిన ట్రంప్‌ను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఫోన్ చేసి అభినందించారు. వీరిద్దరూ మాట్లాడుకుంటుండగా ట్రంప్ మధ్యలో ఫోన్‌ను మస్క్‌కు ఇచ్చినట్లు తెలుస్తోంది. జెలెన్‌స్కీతో మాట్లాడమని స్పేస్‌ఎక్స్ అధినేతను కోరినట్లు సమాచారం. దీంతో ఉక్రెయిన్ అధ్యక్షుడితో మస్క్ కొంతసేపు మాట్లాడినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. వీరిద్దరూ రష్యా-ఉక్రెయిన్ యుద్ధం గురించి చర్చించుకున్నారా? లేదా? అన్న దానిపై స్పష్టత లేదు. అయితే, ఉక్రెయిన్‌లో స్టార్‌లింక్ సేవలను కొనసాగిస్తానని మస్క్ చెప్పినట్లు తెలుస్తోంది. దాదాపు అరగంట పాటు ఈ ముగ్గురు చర్చించుకున్నారట. ఉక్రెయిన్‌కు అండగా ఉంటానని ట్రంప్ ఈ సందర్భంగా హామీ ఇచ్చినట్లు సమాచారం.

అయితే, తాజా కథనాల నేపథ్యంలో ట్రంప్ కార్యవర్గంలో మస్క్ ప్రభావవంతమైన పదవి చేపట్టే అవకాశాలున్నట్లు ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఇటీవల ఫలితాల అనంతరం ట్రంప్ ప్రసంగిస్తూ యుద్ధాల గురించి ప్రస్తావించిన సంగతి తెలిసిందే. 'నేను యుద్ధాలను ప్రారంభించను. కానీ వాటిని ముగించేందుకు సాయం చేస్తా' అని అన్నారు. అంతకుముందు కూడా రష్యా-ఉక్రెయిన్ సంఘర్షణల గురించి ఆయన పలుమార్లు స్పందించారు. తాను అధికారంలోకి వస్తే ఒక్క రోజులోనే ఉద్రిక్తతలను ముగిస్తానని చెప్పారు. ఇక, ఈ ఏడాది సెప్టెంబరులో జెలెన్‌స్కీ న్యూయార్క్ పర్యటన సందర్భంగా ట్రంప్‌తో భేటీ అయిన సంగతి తెలిసిందే.




అంతర్జాతీయంగా, దేశీయంగా గిరాకీ తగ్గడంతో బంగారం, వెండి ధరలు కొంతమేర దిగి వచ్చాయి. అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10 గ్రాములు) బంగారం ధర బుధవారం ఒక్కరోజే 75 డాలర్ల మేర తగ్గి 2660 డాలర్లకు చేరింది. ఫలితంగా హైదరాబాద్ బులియన్ విపణిలో బుధవారం 10 గ్రాముల మేలిమి (999 స్వచ్ఛత) బంగారం ధర రూ. 80,000 కంటే దిగి, రూ. 79,100కు పరిమితమైంది. కిలో వెండి ధర కూడా రూ. 92,700కు చేరింది. అక్టోబరులో ఎన్నడూ లేనంత గరిష్ఠస్థాయులకు బంగారం, వెండి ధరలు చేరిన సంగతి విదితమే. పసిడి ఔన్సు గరిష్ఠంగా అక్టోబరు 30న 2801 డాలర్లకు చేరింది కూడా. ఆ పరిస్థితుల్లో దేశీయంగా 10 గ్రాముల మేలిమి బంగారం ధర రికార్డు స్థాయిలో రూ. 82,000కు చేరింది. కిలో వెండి ధర రూ. 1.02 లక్షలను అధిగమించింది కూడా. ఫలితంగా దేశీయంగా ఈ లోహాల అమ్మకాలు గణనీయంగా తగ్గాయని బులియన్ సంఘాలు చెబుతున్నాయి. దీపావళి ముందొచ్చే ధన త్రయోదశి సందర్భంగా కూడా బంగారం అమ్మకాలు గతేడాదితో పోల్చుకుంటే 15% తగ్గాయని అంచనా. పాత ఆభరణాలు మార్చుకుని, కొత్తవి కొనుగోలు చేసుకునే వారు పెరిగారని బులియన్ సంఘాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం అంతర్జాతీయ విపణిలోనూ బంగారం, వెండిపై లాభాల స్వీకరణ జరుగుతోంది. అధిక ధరల వద్ద కేంద్రబ్యాంకులు కూడా బంగారం కొనుగోళ్లను నిలిపేశాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ తాజా సమీక్షలోనూ వడ్డీరేట్లను 0.25% తగ్గిస్తుందనే అంచనాల మధ్య, డాలర్‌కు గిరాకీ పెరిగి పుత్తడికి గిరాకీ తగ్గింది.

**ట్రంప్ ఎన్నిక నేపథ్యంలో...** అక్టోబరులోనే డాలర్ సూచీ 3% రాణించింది. ఫలితంగా పెట్టుబడులు అటు మళ్లుతున్న సూచనలున్నాయి. ట్రంప్ అధ్యక్షుడిగా ఎన్నికైనందున డాలర్ మరింత బలోపేతం అవుతుందని భావిస్తున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలను బట్టి పసిడి ధరలు కదలాడే అవకాశం ఉందని, ఔన్సు బంగారం 2600 డాలర్ల స్థాయికి దిగిరావచ్చనే అంచనాను ఐసీఐసీఐ సెక్యూరిటీస్ వ్యక్తం చేసింది.

**దేశీయ ధరలకు డాలర్ ఘాటు...** డాలర్ విలువ ఎన్నడూ లేనంత గరిష్ఠస్థాయి అయిన రూ. 84.30కు చేరింది. మనదేశం బంగారం దిగుమతులకు పూర్తిగా దిగుమతులపైనే ఆధారపడి ఉన్నందున, డాలర్ల రూపేణానే అంతర్జాతీయంగా కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఫలితంగా ఇతర దేశాల్లో బంగారం ధరలు బాగా తగ్గినా, మనదేశంలో ఆ మేర ప్రయోజనం మన కొనుగోలుదార్లకు ఉండటం లేదు.

# మన దేశంలో సమానత్వం ఉంది.. నిర్మలా సీతారామన్

బెంగళూరు: మహిళా సాధికారత, పితృస్వామ్యంపై కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. పితృస్వామ్యం మహిళ ఎదుగుదలను అడ్డుకుంటే ఇందిరా గాంధీ ఏ విధంగా ప్రధానమంత్రి అయ్యారని ప్రశ్నించారు. బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో సమానత్వం ఉందని స్త్రీ, పురుష వివక్షత లేదన్నారు. మహిళా సాధికారతపై అడిగిన ప్రశ్నపై కేంద్రమంత్రి స్పందిస్తూ.. "భారత్‌లో మహిళల ఎదుగుదలను పితృస్వామ్యం అడ్డుకుంటే.. మరి ఇందిరాగాంధీ ప్రధాని ఎలా అయ్యారు..? ఇలాంటివి విని మోసపోకండి. మీ కోసం మీరు నిలబడి, తర్కయుక్తంగా మాట్లాడితే. ఏ పితృస్వామ్యం మిమ్మల్ని, మీ ఎదుగుదలను అడ్డుకోలేదు" అని సీతారామన్ పేర్కొన్నారు. అయితే.. మహిళలకు తగిన సౌకర్యాలు కల్పించడం లేదని, దీని కోసం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. భారత్‌లో ఆవిష్కర్తలకు ఉన్న అవకాశాలపై అడిగిన ప్రశ్నకు ఆమె బదులిచ్చారు. "ప్రధాని మోదీ ఆవిష్కర్తలకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించారు. కొత్త ఆవిష్కరణల కోసం కేంద్రం కృషి చేస్తోంది. అది మాత్రమే కాకుండా ఆవిష్కరణలకు తగిన మార్కెట్లను కనుగొనేందుకు కృషి చేస్తోంది" అని తెలిపారు. మొత్తం ప్రభుత్వ కొనుగోళ్లలో 40 శాతం ఎమ్ఎస్ఎమ్ఈల నుంచే వస్తున్నాయని వెల్లడించారు. దీనివల్లే 2 లక్షల స్టార్టప్‌లు పుట్టుకొచ్చాయని.. అందులో 130 యూనికార్న్‌లుగా అవతరించాయని అన్నారు.

# శ్రీలీల అందం హిందోళం


తనదైన అందం ప్రతిభతో అందరి దృష్టిని ఆకర్షించింది శ్రీలీల. ఈ తెలుగమ్మాయి కెరీర్ పరంగా ఫుల్ స్వింగ్ లో ఉంది. పెద్ద హీరోలతో సినిమాలు ఫ్లాపులైనా కానీ, శ్రీలీల ప్రతిభను గుర్తించి దర్శకనిర్మాతలు వరుసగా సినిమాల్లో అవకాశాలు కల్పిస్తున్నారు. ఇక సోషల్ మీడియాల్లోను ఈ బ్యూటీ ప్రత్యేకించి ఫాలోవర్స్ ని సంపాదించుకుంది. వారి కోసం శ్రీలీల హాట్ ఫోటోషూట్ లను షేర్ చేస్తుంది. తాజాగా శ్రీలీల పర్పుల్ కలర్ డిజైనర్ డ్రెస్ లో ఫోజులిచ్చిన ఓ ఫోటోగ్రాఫ్ అంతర్జాలంలో వైరల్ గా మారింది. శ్రీలీల కెరీర్ జర్నీ ఆసక్తికరం. ప్రస్తుతం యూత్ స్టార్ నితిన్ సరసన %-%రాబిన్



హుడ్%-% చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమా తర్వాత కూడా అవకాశాలున్నాయి. దిగ్గజ దర్శకుడు డేవిడ్ దావన్‌తో శ్రీలీల ఓ హిందీ సినిమలో నటించాల్సి ఉంది. కానీ రకరకాల కారణాలతో ఇది కుదరలేదు. మేకర్స్ శ్రీలీలకు మొదట ఈ చిత్రాన్ని ఆఫర్ చేశారు. కానీ తనకు డేట్స్ లేకపోవడంతో సినిమా నుండి తప్పుకుంది. మహేష్ – రవితేజ లాంటి పెద్ద హీరోలతో ఆఫర్లు తనకు పెద్ద విజయాలను అందిస్తాయని ఆశించింది. కానీ అవన్నీ ఫ్లాపులయ్యాయి. ఇప్పుడు నితిన్ తో తాజా చిత్రాన్ని శ్రీలీల అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. నితిన్ ఎనర్జీకి తగ్గట్టుగా శ్రీలీల డ్యాన్సులతో ఆకట్టుకోగలదు.

# సీరత్ కపూర్.. లుక్స్ తోనే సెగలు పుట్టిస్తోంది

సీరత్ కపూర్ ఇటీవల కాలంలో సినిమాల్లో ఎక్కుగా కనిపించకపోయినా కూడా తన గ్లామర్ ఫోటోషూట్లతో యూత్‌కి ప్రత్యేక ఆకర్షణగా మారింది. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో "ఫైర్ అండ్ ఐస్ లీథల్ కాంబినేషన్" అనే క్యాప్షన్‌తో పోస్ట్ చేసిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి. గోల్డెన్ గౌన్‌లో మెరిసిపోతూ, తన అద్భుతమైన ఎక్స్‌ప్రెషన్లతో యూత్‌ని మంత్ర ముగ్ధులను చేసిన ఈ అందాల భామ, తన గ్లామర్ ప్రెజెన్స్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. సీరత్ ఈ లుక్‌తో మరింత పాపులారిటీని సాధిస్తూ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా నిలుస్తోంది. సీరత్ కపూర్ కెరీర్ గురించి చెప్పుకోవాలంటే, ఈ అమ్మడు సినిమాల్లో తన ప్రస్థానాన్ని తెలుగులో ప్రారంభించింది. 2014లో వచ్చిన 'రన్ రాజా రన్' చిత్రం ద్వారా టాలీవుడ్‌లోకి అడుగు పెట్టింది.



మొదటి సినిమా నుంచే తన పెర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకొని మంచి గుర్తింపును తెచ్చుకుంది. ఈ చిత్రంలో తన నైజమైన నటనతో యువతకు క్రష్‌గా మారిపోయిన సీరత్, తరువాత 'టైగర్', 'కృష్ణ అండ్ హిజ్ లీలా', 'మా వినతా' వంటి చిత్రాల్లో కూడా నటించి తన ప్రతిభను చూపించింది. ఇటీవల సీరత్ 'భామాకలాపం 2', 'మనమే' వంటి చిత్రాల్లో కనిపించి తన యాక్టింగ్ స్కిల్స్‌ను మరింత మెరుగుపర్చింది. తక్కువ సమయంలోనే మంచి పేరు తెచ్చుకున్న ఈ ముద్దుగుమ్మ, సోషల్ మీడియాలో సైతం యమ యాక్టివ్‌గా ఉంటుంది. ప్రస్తుతం సీరత్ కపూర్ తన అందంతో పాటు, అభినయంతో కూడా ప్రేక్షకుల్ని ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. ఈ మధ్యకాలంలో ఫోటోషూట్ల ద్వారా కూడా సీరత్ తన ప్రత్యేకతను చాటుకుంటోంది. బోల్డ్ మరియు గ్లామర్ లుక్‌తో యూత్‌కి ఫ్యాషన్ ఐకాన్‌గా నిలుస్తున్న సీరత్, తన క్రేజ్‌ను మరింత పెంచుకుంటూ టాలీవుడ్‌లో మంచి అవకాశాల కోసం ఎదురుచూస్తుంది. మరి ఆమె అందానికి తగ్గట్టుగా ఏమైనా కొత్త అవకాశాలు వస్తాయో లేదో చూడాలి.




# బజార్ ఇండియాపై చురకత్తిలా పటౌడీ బ్యూటీ!




చురకత్తితో గుచ్చితో గుండెలోతుల్లోకి దిగాల్సిందే. చురకత్తి పదును అలాంటింది. మరి అందం అనే చురకత్తితో గుచ్చితే! ఆ గాయం పోటు ఇంకెంత లోతుగా వెళ్తుందో చెప్పాల్సిన పనిలేదు. తాజాగా పటౌడీ వారసురాలు సారా అలీఖాన్ అలాంటి పోటుకే కుర్రాకారుని గురి చేస్తుంది. ఇదిగో అమ్మడిలా బజార్ ఇండియా కవర్ పేజీపై చెల రేగింది. పాల నురుగుల సౌందర్యం పై బ్లాక్ అండ్ బ్లాక్ దుస్తుల్లో తళుక్కున మెరిసింది. నలుపు రంగు ప్యాంట్ పై టాప్ లో మ్యాచింగ్ పీస్ దరించి క్లీవేజ్ బ్యూటీని హైలైట్ చేసింది. బ్యాక్ ను డిజైనర్ కోట్ తో కవర్ చేసింది. చేతిలో హ్యాండ్ బ్యాగ్ చైర్ పై కాలు చాపి స్టైలిష్ గా కెమెరాకి ఫోజులిచ్చింది. మరో పిక్ లో మోడ్రన్ బ్యూటీలో ఫోజులిచ్చింది. సారా హెయిర్ స్టైల్..మ్యాకప్ ఇతర అలంకరణ ప్రతీది మరింత అందంగా తీర్చిదిద్దాయి. సారా స్ట్రెయిట్ ఎటాకింగ్ కుర్ర కారు హృదయాలు ఛిద్రమవ్వడం ఖాయం. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇక సారా అభిమానులు అమ్మడి అందాన్ని ఆకాశానికి ఎత్తకుండా ఉండలేకపోతున్నారు. లుక్స్ గార్జియస్...బ్యూటీఫుల్ లేడీ అంటూ తమదైన శైలిలో కామెంట్ల వర్షం గుప్పిస్తున్నారు. ఇక సారా కెరీర్ సంగతి చూస్తే బ్యాక్ టూ బ్యాక్ సక్సెస్ లతో దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. గ్యాస్ లైట్..జర్ హట్ కే జర బచ్ కే..యే వతన్ మేరా వతన్ లాంటి విజయాలతో రెట్టింపు ఉత్సాహంలో ఉంది.

ప్రస్తుతం అమ్మడి ఖాతాలో హిందీలోనే ఐదారు సినిమాలు రెడీగా ఉన్నాయి. అవన్నీ షూటింగ్ దశలో ఉన్నాయి. అవి గాక కొత్త ఛాన్సులు క్యూలో ఉన్నాయి. నటిగా డే బైడే షైన్ అవుతుంది. టాలీవుడ్ లో నూ లాంచ్ అవ్వాలని ప్రయత్నాలు చేస్తోంది. సరైన ఛాన్స్ వస్తే దూకడానికి సిద్దంగానే ఉంది. ఇప్పటికే డాడ్ సైఫ్ అలీఖాన్ దేవరతో లాంచ్ అయిన సంగతి తెలిసిందే.

# సౌత్ హీరోలతో ధావన్ బోయ్ మల్టీస్టారర్ చేయడా?




వరుణ్ ధావన్ నటించిన తాజా సినిమా 'బేబీ జాన్' 25 డిసెంబర్ 2024న విడుదల కానుంది. ఎ. కాళీశ్వరన్ దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ డ్రామాలో కీర్తి సురేష్ – వామికా గబ్బి కథానాయికలుగా నటించారు. ఇటీవలి ఇంటర్వ్యూలో చిత్ర నిర్మాత జ్యోతి దేశ్‌పాండే వరుణ్ ధావన్ మునుపెన్నడూ చూడని నటనను ప్రదర్శించాడని, బేబీ జాన్ అందరి మనసులను చెదరగొడుతుందని పేర్కొన్నారు. ఈ చిత్రం ఫ్రాంచైజీగా మారే అవకాశం ఉందని ఆమె వెల్లడించింది. సీక్వెల్‌గా కాదు.. పాత్ర ఆధారిత ఫ్రాంచైజీగా మారుతుందని తెలిపారు. 1నవంబర్ 2024న విడుదలవుతున్న సింగమ్ ఎగైన్ ప్రింట్‌లకు బేబీ జాన్ ప్రచార చిత్రాన్ని జోడిస్తారని జ్యోతి దేశ్‌పాండే ధృవీకరించారు. అట్లీ – జియో స్టూడియోస్ సమర్పకులుగా ఏ ఫర్ యాపిల్ స్టూడియోస్ – సినీ 1 స్టూడియోస్ బ్యానర్‌లపై నిర్మించిన ఈ చిత్రానికి థమన్ సంగీతం అందించారు. బాలీవుడ్ యువహీరో వరుణ్ ధావన్ ప్రస్తుతం పాన్ ఇండియా మార్కెట్ ని ఏలాలని కలలు గంటున్నాడు. అయితే ఇంతకుముందు అతడు చేసిన ప్రయత్నం అంతంత మాత్రం ఫలితాన్నే ఇచ్చింది. మునుముందు అతడు ప్రయోగాత్మక కథాంశాలు, సౌత్ డైరెక్టర్లతో పని చేసేందుకు ఆసక్తిగా ఉన్నాడు. కానీ దానికి సమయం పడుతుందని సమాచారం. ప్రస్తుతం సౌత్ – నార్త్ కాంబోలో మల్టీస్టారర్ల ట్రెండ్ ఊపందుకుంది. ఇదే హుషారులో వరుణ్ ధావన్ తెలుగు, తమిళ హీరోలతో కలిసి నటిస్తాడేమో చూడాలి.

# వారికి ప్రత్యేక స్థానం! మలైకా పోస్ట్ ఎవరినుద్దేశించి?


చాలా కాలంగా రిలేషన్‌షిప్‌లో ఉన్న అర్జున్ కపూర్ – మలైకా అరోరా జంట విడిపోయారని ఇటీవల కథనాలొచ్చిన సంగతి తెలిసిందే. వారి రిలేషన్ స్టేటస్ గురించి రకరకాలుగా పుకార్లు షికార్ చేస్తున్నాయి. ఇలాంటి సమయంలో మలైకా ఇటీవల తన ఇన్‌స్టా కథనంలో ఒక రహస్య పోస్ట్‌ను షేర్ చేసారు. దాని సారాంశం ఇలా ఉంది. "మీ ఆనందంలో పాలుపంచుకునే వారి పట్ల శ్రద్ధ వహించండి.. మీ బాధను అనుభవించండి.. వారు మీ హృదయంలో ప్రత్యేక స్థానానికి నిజంగా అర్హులు" అని పోస్ట్‌లో ఉంది.. మలైకా ఎవరి పేరును దీనికి జత చేయలేదు. క్యాప్షన్‌ను చేర్చలేదు. కానీ అర్జున్ కపూర్ నుంచి విడిపోయిందనే పుకార్ల కారణంగా మలైకా పేరు చర్చనీయాంశంగా మారింది. అంతకుముందు మలైకా అరోరా గత నెలలో అర్జున్ పుట్టినరోజు వేడుకలు అతడి నివాసంలో సెలబ్రేట్ చేయగా వాటికి స్కిప్ చేసింది. ఇది బ్రేకప్ పుకార్లకు ఆజ్యం పోసింది. మలైకా బర్త్ డే



వేడుకలను అర్జున్ స్కిప్ కొట్టాడు. ఈ రెండు సందర్భాలు సందేహాలను రాజేసాయి. తన బ్రేకప్ గురించిన చర్చ పేరుతో ఆన్ లైన్ లో ఎలాంటి ప్రతికూలతను వ్యాప్తి చేసారో చెబుతూ మలైకా కలతకు గురైంది. గతంలో హలో మ్యాగజైన్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇంటర్నెట్ విషపూరిత స్వభావం గురించి మలైకా వెల్లడించింది. నేను ఒక మెకానిజం లేదా షీల్డ్‌ను అభివృద్ధి చేసాను.. ఇక్కడ ప్రతికూలత నన్ను ప్రభావితం చేయనివ్వదు! అని మలైకా వెల్లడించింది. నేను పని చేసే చోట.. సోషల్ మీడియా లేదా ట్రోల్‌లు అన్నిటి నుండి నన్ను రక్షించుకున్నాను. నేను ఆ ప్రతికూల శక్తిని తెలుసుకున్న మరుక్షణం వాటికి దూరంగా ఉంటాను. ఇది నేను కాలక్రమేణా నేర్చుకున్న నైపుణ్యం. గతం.. అది నన్ను ప్రభావితం చేస్తుంది. ప్రభావితం చేయదని చెబితే అది అబద్ధం. నేను మనిషిని.. ఏడుస్తాను.. బ్రేక్ అవుతాను. ట్రోలింగ్ జరిగినప్పుడు అన్ని భావోద్వేగాలను అనుభవిస్తాను... కానీ మీరు నేను ఎలా ఉన్నానో పబ్లిక్‌గా చూడలేరు..! అని అన్నారు. మలైకా– అర్జున్ 2018లో డేటింగ్ ప్రారంభించారు. ఇద్దరూ తమ రిలేషన్ షిప్ గురించి పెద్దగా బహిరంగంగా చర్చించకపోయినా వెకేషన్ల నుంచి ఫోటోలు, వీడియోలను షేర్ చేసారు. అలాగే ఒకరికొకరు పుట్టినరోజులు సెలబ్రేట్ చేసారు. కానీ అవేవీ ఇప్పుడు లేవు. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. అర్జున్ విలన్‌గా నటించిన సింగం ఎగైన్ విడుదలకు సిద్ధమవుతోంది. అజయ్ దేవగన్, దీపికా పదుకొణె, టైగర్ ష్రాఫ్, రణ్‌వీర్ సింగ్ , అక్షయ్ కుమార్ తదితరులు నటించిన ఈ చిత్రం దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. మలైకా బుల్లితెర రియాలిటీ షోలు, ప్రకటనల ద్వారా భారీగా ఆర్జిస్తోంది.

# జ్యోతిరాయ్.. కూల్ అండ్ క్లాసీ లుక్

టాలీవుడ్ బ్యూటీ జ్యోతి పూర్వాజ్ తన ప్రత్యేకమైన స్టైల్‌తో సోషల్ మీడియాలో మరొకసారి హల్‌చల్ చేస్తోంది. కారులో కూర్చొని సన్ గ్లాసెస్ తో కూల్ లుక్‌లో దిగిన ఫోటోను ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. సింపుల్ ఎమోజీలతో క్యాప్షన్ ఇస్తూ ఈ ఫోటోలో తన గ్లామర్‌ను హైలెట్ చేస్తూ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. కారులో కూర్చుని సాలిడ్ పోజ్ ఇస్తూ తీసుకున్న ఈ ఫోటోలో ఆమె ప్రత్యేకమైన అందంతో ప్రేక్షకులను కట్టిపడేస్తున్నారు. పెర్ఫెక్ట్ స్టైలింగ్‌తో తీసుకున్న ఈ ఫోటోలో జ్యోతి వేసుకున్న క్యూట్ డ్రెస్ ఆమె గ్లామర్‌ను మరింత హైలైట్ చేస్తోంది. సన్‌గ్లాసెస్, కాస్ట్యూమ్స్ తీరుతో మోడ్రన్ లుక్‌లో కనువిందు చేస్తోన్న ఆమె ప్రత్యేక ఫ్యాన్ బేస్‌ను కలిగి ఉంది. హైలైట్‌గా నిలుస్తోన్న ఆమె డ్రెస్సింగ్ సెన్స్, కూల్ అండ్ క్లాసీ లుక్స్‌తో అభిమానుల మనసును దోచుకుపోతున్నారు. ఈ ఫోటోకు ఇన్‌స్టాలో 10,000కుపైగా లైకులు, 100కు పైగా కామెంట్లు రావడం చూస్తే



ఆమె పాపులారిటీ మరింత పెరుగుతున్నట్లు అనిపిస్తోంది. జ్యోతి పూర్వాజ్ తరచూ ఇలాంటి గ్లామరస్ ఫోటోషూట్లు చేస్తూ ఫ్యాషన్ ప్రపంచంలో తనదైన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. సాధారణ గ్లామర్ లుక్‌లోనే కాకుండా, కారు బ్యాక్‌డ్రాప్‌లో ఇలాంటి స్టైలిష్ ఫోటోలు ఆమెను మరింత ప్రత్యేకంగా చూపిస్తున్నాయి. జ్యోతి పూర్వాజ్ కెరీర్ టెలివిజన్ ద్వారా మొదలైంది. టీవీ సీరియల్స్‌లో వివిధ రకాల పాత్రలు పోషిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. చిన్న తెరపై ఆమె నటన అందరినీ ఆకట్టుకుంది. ఈ అవకాశాలు ఆమెకు సినిమా ఇండస్ట్రీలో కూడా అడుగుపెట్టడానికి దారి తీశాయి. ఆ తర్వాత తెలుగు సినిమాల్లో సపోర్టింగ్ రోల్స్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. కేవలం గ్లామర్ పాత్రలకే కాకుండా, సీరియస్ పాత్రలతో కూడా మంచి అభినందనలు పొందారు.




## ప్రధాని అబద్ధాలు చెప్పడం మానుకోకపోతే.. మేం నిజాలు చెబుతూనే ఉంటాం: సీఎం రేవంత్

ముంబయి: మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ.. తెలంగాణ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రధాని అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం కోసం రేవంత్‌రెడ్డి ముంబయి వెళ్లారు. అక్కడి పీసీసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. “తెలంగాణ ప్రభుత్వం అమలు కానీ హామీలు ఇచ్చిందని మోదీ అన్నారు. తెలంగాణలో రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం రూ.2 లక్షల రుణాలు మాఫీ చేశాం. 22 లక్షల మంది రైతులకు రూ.17,829 కోట్లు రుణమాఫీ చేశాం. ఇందుకు సంబంధించి వివరాలు కావాలంటే ఇవ్వడానికి మేం సిద్ధం. తెలంగాణలో 10 నెలల్లోనే 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. మహారాష్ట్ర భాజపా నేతలు తెలంగాణ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. ప్రధాని కాంగ్రెస్ గ్యారంటీల అమలుపై అబద్ధాలు చెబుతున్నారు. ఆయన అబద్ధాలు చెప్పడం మానుకోకపోతే మేం నిజాలు చెబుతూనే ఉంటాం. మహారాష్ట్ర ప్రజలకు 6 గ్యారంటీల అమలుపై నిజాలు చెప్పేందుకు వచ్చా. ఇక్కడ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమాన్ని మరిచాయి. నల్ల చట్టాలు తెచ్చి అదానీ, అంబానీలకు మేలు చేయాలని మోదీ భావించారు. సామాజిక న్యాయం అందించేందుకు తెలంగాణలో కులగణన చేపట్టాం. దేశ చరిత్రలో మహారాష్ట్రకు ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడికి రావాల్సిన 17 మెగా ప్రాజెక్టులు గుజరాత్‌కు వెళ్లాయి. ఇక్కడి ప్రజలను మోసం చేసిన భాజపాను ఎన్నికల్లో ఓడించాలి” అని రేవంత్‌రెడ్డి అన్నారు.



## ఇంటింటి సర్వే కోసం పర్యవేక్షణ అధికారులను నియమించిన ప్రభుత్వం

హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో కచ్చితత్వంతోపాటు షెడ్యూల్ ప్రకారం పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జీహెచ్‌ఎంసీతోపాటు జోనల్ స్థాయిలోనూ ఈ సర్వే పకడ్బందీగా నిర్వహించేందుకు క్షేత్ర స్థాయిలో సిబ్బందితో సమన్వయం కోసం పర్యవేక్షణ అధికారులను నియమించింది. ఈ మేరకు రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో పర్యవేక్షణ అధికారిగా హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సికింద్రాబాద్, చార్మినార్ జోన్లకు హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్ శ్రీవత్సను నియమించారు. ఎల్బీనగర్, ఖైరతాబాద్ జోన్లకు పురపాలక శాఖ ఉప కార్యదర్శి ప్రియాంక, శేరిలింగంపల్లి, కూకట్ పల్లి జోన్లకు జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ పర్యవేక్షించనున్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ఝూర?ండ్ ఎన్నికల అధికారిగా వెళ్లారు. అక్కడి నుంచే సర్వే తీరును ఆయన పరిశీలిస్తున్నారు. దీంతో క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు తలెత్తకుండా సర్వే పర్యవేక్షణ బాధ్యతలను సర్ఫరాజ్‌కు అప్పగించారు. జోనల్ కమిషనర్లు, పర్యవేక్షణ అధికారులను సమన్వయం చేసుకుంటూ గ్రేటర్‌లో నిర్దేశించిన గడువులోగా సర్వేను పూర్తి చేయాలని, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు సర్ఫరాజ్ సహకారం అందించాలని ప్రభుత్వం సూచించింది.




హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలోని పనుల టెండర్ల ద్వారా ప్రభుత్వ అవినీతి బయటపడిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఈ మేరకు ఆయన ‘ఎక్స్’ వేదికగా పోస్టు చేశారు. ఎక్కువ కోట్ చేసిన అనుకూల కంపెనీలకు టెండర్లు కట్టబెట్టారని ఆరోపించారు. రాష్ట్రం ఇబ్బందుల్లో ఉంటే రూ.4,350 కోట్ల ప్రజాధనాన్ని కొందరికి అప్పగించారని చెప్పారు. అవినీతి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. కాంగ్రెస్ పార్టీ తన ఖజానా నింపుకొనేందుకు తెలంగాణను ఏటీఎంగా వాడుకుంటోందని కేటీఆర్ అన్నారు.

## తెలంగాణలో నవంబర్ 14 నుంచి కాంగ్రెస్ ప్రజా విజయోత్సవాలు: భట్టి



హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనపై నవంబర్ 14 నుంచి డిసెంబర్ 9 వరకు ప్రజా విజయోత్సవాలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజా విజయోత్సవాలు ఏవిధంగా జరపాలి, ఏ అంశాలపై ప్రచారం చేయాలనే దానిపై విధివిధానాలు రూపొందించేందుకు భట్టి అధ్యక్షతన కేబినెట్ సబ్‌కమిటీ సమావేశమైంది. ఈ మేరకు ఉత్సవాల నిర్వహణపై శనివారం జరిగిన సబ్‌కమిటీ భేటీలో పలు నిర్ణయాలు తీసుకోవడంతోపాటు రోడ్‌మ్యాప్ సిద్ధం చేశారు. దివంగత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి రోజున ప్రజా విజయోత్సవాలు ప్రారంభించి.. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ పుట్టినరోజు వరకు నిర్వహించే విధంగా ప్రణాళిక రూపొందించింది. విజయోత్సవాల్లో భాగంగా భారీగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ 25 రోజుల పాటు వివిధ రకాల కార్యక్రమాలతో పాటు పలు కీలక అభివృద్ధి పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలపైనా ప్రజలకు ఈ కార్యక్రమాల ద్వారా వివరించనున్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుంచి మొదలుపెట్టి రాష్ట్ర వ్యాప్తంగా గ్రామస్థాయి వరకు ఈ సంబరాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. భేటీ అనంతరం భట్టి మాట్లాడుతూ.. “ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఉస్మానియా ఆస్పత్రి, స్పోర్ట్స్ వర్సిటీకి శంకుస్థాపన చేస్తాం. 28న పారామెడికల్, 16 నర్సింగ్ కళాశాలలను ప్రారంభిస్తాం. ఉత్సవాల్లో భాగంగా పలు కంపెనీలో ఒప్పందాలు చేసుకుంటాం. గ్రూప్-4కు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేస్తాం. డిసెంబర్ 9న హైదరాబాద్‌లో భారీగా ప్రజా విజయోత్సవాలు నిర్వహిస్తాం” అని తెలిపారు.

## ఏం కోల్పోయారో తెలంగాణ ప్రజలకు తెలిసొచ్చింది: కేసీఆర్



సిద్దిపేట: ఏం కోల్పోయారో తెలంగాణ ప్రజలకు తెలిసొచ్చిందని భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. మళ్లీ భారాస అధికారంలోకి వస్తుందని ప్రజలు చెబుతున్నారని తెలిపారు. సిద్దిపేటలో పాలకుర్తి నియోజకవర్గ భారాస నేతలతో కేసీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారాస నేతలు హైరానా పడాల్సిన అవసరం లేదన్నారు. సమాజాన్ని నిలబెట్టి, నిర్మాణం చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం.. కూలగొడతామని పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడుతోందని మండిపడ్డారు. ప్రజలు బాధ్యత ఇస్తే.. అంతే బరువుతో సేవ చేయాలన్నారు. గతంలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలకంటే 90 శాతం ఎక్కువే చేశామని కేసీఆర్ స్పష్టం చేశారు.




## రైతులారా.. అధైర్యపడొద్దు: మంత్రి పొంగులేటి

హైదరాబాద్: రైతులు అధైర్యపడొద్దని, పంటలకు మద్దతు ధర ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

డిసెంబర్ ఆఖరిలోపు పెండింగ్‌లో ఉన్న రూ.13 వేల కోట్ల రుణమాఫీ చేస్తామన్నారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి తీరుతామన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామన్నారు.

డిసెంబర్‌లో గ్రూప్-1 అభ్యర్థులకు నియామకపత్రాలు ఇచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

## హుజూరాబాద్‌లో ఉద్రిక్తత.. అస్వస్థతకు గురైన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి..



%కరీంనగర్: హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేపట్టిన ధర్నా తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. రెండో విడత దళిత బంధు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కౌశిక్ రెడ్డి ధర్నా చేపట్టారు. అనుమతి లేకుండా వందలాది ఒక్కసారిగా అంబేద్కర్ చౌరస్తా వద్దకు చేరుకోవడంతో పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యేతో సహా పలువురు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో కౌశిక్ రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. హుటాహుటిన ఆయన్ను స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. దళిత బంధు రాని వారంతా దరఖాస్తు చేసుకోవాలని నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. అయితే రెండో విడత దళిత బంధు ఇవ్వాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే ధర్నా, రాస్తారోకోకు పిలుపునిచ్చారు. ఈ మేరకు పెద్దఎత్తున దరఖాస్తుదారులతో కలిసి హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్దకు ఎమ్మెల్యే చేరుకున్నారు. వారితోపాటు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. అందరూ కలిసి పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. అయితే వారిని అడ్డుకునేందుకు హుజురాబాద్, జమ్మికుంట సీఐలు, ఎస్ఐలు తమ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. వారిని నిలువరించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు, నిరసనకారులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. పరిస్థితిని అదుపు చేసేందుకు దళిత బంధు లబ్ధిదారులతోపాటు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు వ్యాన్‌లో ఎక్కించే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో వారి మధ్య తీవ్ర తోపులాట చోటు చేసుకుంది. దీంతో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పోలీసులు అతన్ని హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించారు. అలాగే ఆందోళనకారులను వ్యానులో ఎక్కించి స్టేషన్‌కు తరలించారు. అయితే మహిళా పోలీసులు లేకపోవడంతో మహిళా ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేసేందుకు వెనకడుగు వేశారు. అనంతరం మహిళా కానిస్టేబుళ్లను పిలిపించి రోడ్డుపై బైఠాయించిన వారిని అదుపులోకి తీసుకున్నారు. నిరసన నేపథ్యంలో వరంగల్- కరీంనగర్ జాతీయ రహదారిపై దాదాపు గంటపాటు వాహనాలు నిలిచిపోయాయి.

## మూసీ కాలుష్యానికి కారణం కాంగ్రెస్ చేసిన పాపమే: హరీశ్‌రావు



హైదరాబాద్: సమస్యలు గాలికి వదిలి మంత్రులు, సీఎం గాల్లో తిరుగుతున్నారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. మెదక్ జిల్లా కొల్చారం మండలం చిన్న ఘనపూర్‌లో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. మూసీ కాలుష్యానికి కారణం కాంగ్రెస్ చేసిన పాపమే అన్నారు. మూసీ నదిపై పాదయాత్ర కాదు.. పాపయాత్ర చేస్తున్నారని చెప్పారు. మూసీ నది సమస్యలపై పాదయాత్రకు తాను సిద్ధమని పేర్కొన్నారు. ప్రజల సమస్యల గురించి ప్రశ్నిస్తున్న కేటీఆర్‌పై కేసులు పెట్టేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ప్రజా బలంతోనే కాంగ్రెస్ కుట్రలను ఎదుర్కొంటామన్నారు. కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలు అప్రజాస్వామికమని చెప్పారు. రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలను మోసం చేసింది కాంగ్రెస్ అని మండిపడ్డారు. యాదాద్రిని మరింత అభివృద్ధి చేసేందుకు సీఎం నిధులు కేటాయించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

**మంత్రి ఉత్తమ్ సొంత జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు లేవు :** ముఖ్యమంత్రి సహా మంత్రులు పక్క రాష్ట్రాల్లో ప్రచారానికి వెళ్లడాన్ని హరీశ్‌రావు తప్పుబట్టారు. ఈమేరకు ఆయన ‘ఎక్స్’ వేదికగా పోస్టు చేశారు. రాష్ట్రంలో సమస్యలు గాలికి వదిలి పక్క రాష్ట్రాల్లో ప్రచారానికి వెళ్తున్నారని ఆరోపించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత జిల్లాలోనే ధాన్యం కొనుగోళ్లు లేవని ఎద్దేవా చేశారు. మంత్రి సీతక్క సొంత జిల్లాలో పత్తికి మద్దతు ధర లేదన్నారు. ఆహార కల్తీ విషయంలో ముఖ్యమంత్రికి పట్టింపే లేదని విమర్శించారు. కాంగ్రెస్ చెప్పిన మార్పు ఇదేనా అని ప్రశ్నించారు. కలుషితాహారం కారణంగా గురుకులాల్లో విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నా పట్టించుకోవడం లేదని చెప్పారు.

### నాగార్జున సాగర్ వద్ద ఏపీ, తెలంగాణ అధికారుల మధ్య వివాదం

నాగార్జున సాగర్: ఏపీ, తెలంగాణ అధికారుల మధ్య నాగార్జున సాగర్ వద్ద మరోసారి వివాదం చోటుచేసుకుంది. కుడి కాల్వ వాటర్ రీడింగ్ నమోదుకు తెలంగాణ అధికారులు వచ్చారు. వీరిని ఏపీ అధికారులు అడ్డుకోవడంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ ఘటనపై కేఆర్ఎంబీ యాజమాన్యానికి తెలంగాణ అధికారులు సమాచారమిచ్చారు. ఇరు రాష్ట్రాల అధికారులకు సాగర్ ఎస్ఈ కృష్ణమోహన్ సర్దిచెప్పారు.



## కులగణనపై మంత్రి పొన్నం ప్రభాకర్ షాకింగ్ కామెంట్స్



హైదరాబాద్: కులగణనకు బీజేపీ అనుకూలమా కాదా ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ డా. లక్ష్మణ్ చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దేశవ్యాప్తంగా సర్వే చేసేందుకు కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తెస్తారా లేదా అని నిలదీశారు. తెలంగాణలో కులగణన సర్వేపై లక్ష్మణ్ అభిప్రాయం చెప్పాలని ప్రశ్నించారు. ఇవాళ(శనివారం)గాంధీ భవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా సమావేశం నిర్వహించారు, ఈ సమావేశంలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల కోసం కులగణన జరుపుతున్నామని బీజేపీ నేతలు అంటున్నారని అన్నారు. సర్వేను అడ్డుకోవాలని చూస్తే లక్ష్మణ్ ద్రోహిగా మిగిలిపోతారని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయాలా వద్దా అని నిలదీశారు. బీజేపీ ఎన్నికల్లో పూర్తిగా మతం రంగును పూసిందని ఆరోపించారు. లక్ష్మణ్ మీద గౌరవం ఉండేదని, కానీ ఇప్పుడు ఆ గౌరవాన్ని పోగొట్టుకున్నారని అన్నారు. బలహీన వర్గాలను అవమానించే విధంగా లక్ష్మణ్ మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు బీజేపీ వ్యతిరేకమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

**బీజేపీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..** “బీజేపీ నేతల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రాజస్థాన్‌లో రిజర్వేషన్ అమలు చేస్తుంటే హేమంత్ సొరేన్‌ను అరెస్ట్ చేశారు. వీపీ సింగ్ రిజర్వేషన్లు తెస్తే కమండలం పేరు మీద పదవి నుంచి తప్పించారు. బలహీన వర్గాలకు చెందిన మోదీ బీసీల కోసం పదేళ్లలో ఏమైనా చేశారా చెప్పాలి. తెలంగాణలో బీజేపీ బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పి బీసీ అధ్యక్షుడిని తీసేశారు. సివిల్ సొసైటీలో అందరి అభిప్రాయం తీసుకుని కులగణన చేస్తున్నాం. కులగణనకు అడ్డం పడటానికి బీజేపీ చాలా ప్రయత్నాలు చేస్తుంది. ప్రభుత్వం ఏ డాక్యుమెంట్ అడగట్లేదు. సమాచారాన్ని ప్రభుత్వం గోప్యంగా ఉంచుతుంది. బీఆర్ఎస్ సర్వే చేపట్టలేకపోయింది. మేము చేస్తున్నాం సహకరించండి. మూసీ పరివాహక ప్రాంత ప్రజల జీవన విధానం మార్చాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రక్షాళన చేస్తున్నారు. మీరు చేయలేని ప్రక్షాళన మేము చేస్తున్నాం సహకరించాలి.. వీలయితే సపోర్ట్ చేయాలి” అని మంత్రి పొన్నం ప్రబాకర్ అన్నారు.

**చట్టాన్ని చేతుల్లోకి తీసుకోము..** “మాజీ మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్ అన్నట్లు కులగొట్టిన ప్రాంతాలకు వస్తాం. పదేళ్లు అధికారంలో ఉన్న వారు, వారిచ్చిన గ్యారంటీలు ఏమయ్యాయి. ముందుగా చెప్పాలి. కిషన్ రెడ్డి ఏవిధంగా హైదరాబాద్‌కు ఉపయోగపడుతున్నారో టవర్ సర్కిల్ దగ్గర చర్చకు సిద్ధమా అంటే సప్పుడు చేయలేదు. జైలు కట్టినం కేసీఆర్ కుటుంబం అంతా జైలుకే అని బండి సంజయ్ అన్నారు. కేటీఆర్‌ని పామ్‌హౌస్ కేసులో ఎందుకు అరెస్ట్ చేయట్లేదని బండి సంజయ్ అంటున్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని మేము అరెస్ట్ చేయం. కేటీఆర్ , కేసీఆర్, హరీష్ రావులను అరెస్ట్ చేస్తామని మేము అనలేదు. పదేళ్లు అధికారంలో ఉండి ఢిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీ పట్టింది మీరు కాదా. రాష్ట్ర ప్రయోజనాల కోసం రాబోయే పార్లమెంట్ సెషన్‌లో ఢిల్లీకి వెళ్లి కొట్లాడతాం. తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములుగా ఉండక పోతే మీరు చరిత్ర హీనులుగా మిగిలిపోతారు” అని మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com